అవకాయ్ అమ్మాయ్

ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

ఆగస్టు 28, 2016

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell : 9849070838



ట్రాక్‌లోకి ఎప్పుడు ?

రంగు తక్కువ కాదు

టాలెంట్ ఉండాలే కానీ రంగు తక్కువ కాదని అంటోంది తనిష్ఠా చటర్జీ. గ్లామర్‌కే పెద్ద పీట వేసే సినీ ప్రపంచంలో అందునా బాలీవుడ్‌లో రాణించాలంటే కాస్త చాయ తక్కువ ఉన్నవాళ్లకు కష్టం అనే మాటను మరోసారి మటుమాయం చేసిన నటి ఈమె. డస్కీ బ్యూటీలుగా పేరున్న కాజోల్, శిల్పా శెట్టి, దీపిక పదుకోన్, బిపాసా బసు, రాణీ ముఖర్జీ, ప్రియాంక చోప్రా, ఇలియానాలు బాలీవుడ్‌ను షేక్ చేశారనే విషయాన్ని ఆమె గుర్తు చేస్తున్నారు. గతేడాది ఆస్ట్రేలియా చిత్ర సీమలో మంచి మార్కులు కొట్టేసిన 'అన్ ఇండియన్' ఆంగ్ల చిత్రంలో తనిష్ఠా ప్రధాన పాత్ర పోషించింది. ఆమెకు జంటగా ఆసీస్ క్రికెట్ స్టార్ బ్రెట్ లీ నటించాడు. ఇప్పుడా సినిమా భారత్‌లోను విడుదలవబోతోంది. బాలీవుడ్‌లో కంటే ఆంగ్ల చిత్ర పరిశ్రమల్లో తన మాటను ఎప్పుడో రుజువు చేసింది తనిష్ఠా. ప్రఖ్యాత ఆంగ్ల నవల 'బ్రిక్ లేన్'ను చిత్రంగా తీస్తే అందులో కీలక పాత్రను ఆమే పోషించి బ్రిటిష్ అవార్డులకు నామినేట్ కూడా అయ్యింది. అదే కాదు 'షాడోస్ ఆఫ్ టైమ్', 'రోడ్', 'మూవీ', 'దేఖ్ ఇండియన్ సర్కస్', 'స్ట్రింగ్స్', 'జీబర్', కస్తూరీ', 'హాఫ్ ది స్కై', 'అన్నా కరెనీనా', 'వైట్ ఎలిఫెంట్', 'గులాబ్ గ్యాంగ్', 'మాన్‌సూన్ షూటౌట్', 'పార్చ్‌డ్' వంటి విదేశీ, దేశీ, ప్రాంతీయ చిత్ర పరిశ్రమల్లో తనదంటూ ప్రత్యేకత నిలబెట్టుకున్న తనిష్ఠా తన మేని చాయ చూసి గర్వపడుతుంది. అందమనేది వ్యక్తిత్వంలో, వ్యక్తీకరణలో ఉంటుందని చెప్పే తనిష్ఠా డస్కీని మరింత బ్యూటీ చేసేసింది. అందుకే ఆమెను 'ప్రిన్సెస్ ఆఫ్ పారాల్లల్ సినిమా' అంటారు.

శిశువు వింతగా పుడితే గ్రహాంతర వాసి అని, కుటుంబ నియంత్రణ పద్ధతులు కడుపులో పుండుని కలిగిస్తాయనీ ఇలా ఎన్నో అపోహలు, మూఢనమ్మకాలతో జీవించేవారు మహారాష్ట్రలోని గడ్చిరోలి తెగలు. వీరిలో సామాజిక స్పృహ కలిగించడం ఓ సవాలు. ఆ సవాలునే స్వీకరించి ఆ గ్రామాల్ని ఆరోగ్యవంతం, చైతన్యవంతం చేశారు డాక్టర్ రాణి బంగ్. సదుపాయాల్ని, సౌకర్యాల్ని కాదనుకుని ఆ మారు మూల గ్రామాల్లోనే ఉంటూ ఆ తెగలకే తన వైద్య వృత్తిని అంకితం చేశారామె. ఆమె కనుగొన్న పద్ధతుల్ని మహారాష్ట్ర ప్రభుత్వాసుపత్రుల్లో అమలుచేస్తున్నారు.

పల్లెకు వైద్యం

మహారాష్ట్రలో వైద్య విద్యని పూర్తిచేసిన రాణి బంగ్ అతని భర్త అభయ్ బంగ్ ఇద్దరూ విదేశాల్లో ప్రజారోగ్య శాస్త్రంలో పిహెచ్‌డి పూర్తి చేశారు. స్వదేశంలో వైద్యసేవలందించాలనే లక్ష్యంతో మహారాష్ట్రలోని గడ్చిరోలి ప్రాంతంలో ఒక క్లినిక్‌ని ప్రారంభించారు. భారత్‌లోని అత్యంత వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో గడ్చిరోలి ఒకటి. అటవీ ప్రాంతంగా ఉండే ఈ గ్రామంలో అపోహలతో స్థానిక తెగల ప్రజలు వైద్యానికి దూరంగా ఉండేవారు. ఏదైనా ప్రాణాపాయం వస్తే తప్ప అదీ పరిస్థితి చేయిదాటిపోతున్న సమయంలో వైద్యుడిని ఆశ్రయించడం... అప్పటికే ప్రాణనష్టం జరగడం.. ఒకప్పుడు ఇక్కడ ఎక్కువగా కనిపించే దృశ్యాలు. సరైన గర్భధారణ పద్ధతులు పాటించకపోవడం కాన్పు సమయంల్లో శిశు మరణాలు ఎక్కువగా చోటుచేసుకునేవి. తాగుడుకి బానిసై కుటుంబ పెద్ద చనిపోతే స్త్రీలు కుటుంబ భారాన్ని మోసేవారు. గ్రామీణ తెగల్లో వేశ్యావృత్తిలో ఉన్న మహిళలు తీవ్ర వివక్షతో అనారోగ్యానికి గురయ్యేవారు. గైనకాలజిస్ట్ అయిన రాణి బంగ్ ఇలాంటి పరిస్థితుల్లో మార్పు తేవాలనుకున్నారు.

వితంతువు కదిలించింది

ఒక రోజు కన్హాపూర్ ప్రాంతానికి చెందిన రాయ్ బాయ్ దబోల్ అనే వితంతువు తన పసిపాప ఆరోగ్యం బాలేదంటూ రాణి బంగ్ వద్దకి తీసుకొచ్చింది. నిమోనియా, గ్యాస్ట్రిక్ సమస్యతో అప్పటికే ఆ చిన్నారి ఆరోగ్యం విషమించడంతో అస్పత్రిలో చేర్చాల్సిందిగా రాణిబంగ్ ఆమెకి చెప్పారు. డాక్టర్ మాట పట్టించుకోకుండా ఆమె అక్కడి నుండి వెనుదిరిగింది. రెండు రోజుల తర్వాత రాయ్ బాయ్ అనారోగ్యంతో ఉన్న శిశు వును రాణిబంగ్ వద్దకు మళ్లీ తీసుకొచ్చి వైద్యం చేయండంటూ ప్రాధేయపడింది. అప్పటికే కొన ఊపిరితో ఉన్న ఆ శిశువు కొద్ది సేపటికే చనిపోయింది. తన కళ్ల ముందే ఆ చిన్నారి కన్నుమూయడం రాణి బంగ్‌ని తీవ్రంగా కలచి వేసింది. ఆస్పత్రిలో చేర్చమని హెచ్చరించినా ఎందుకు వినలేదంటూ రాయ్ బాయ్‌ని నిలదీసారు రాణిబంగ్. కొంత సేపటికి రాయ్ బాయ్ స్పందిస్తూ కుటుంబ పెద్ద కొంత కాలం క్రితం అనారోగ్యంతో చనిపోవడంతో కుటుంబ భారం తనమీదే పడిందని చెప్పింది. ఐదుగురు సంతానంలో అందరూ చిన్నపిల్లలే. ఒక్క రోజు పని మానుకుంటే ఆ పూట ఇంట్లో పొయ్యి వెలిగే పరిస్థితి లేదని వివరించింది. మిగతా పిల్లలు ఆకలితో అల్లాడటం చూడలేకే తను పనికెళ్లి పోయానని, ఆ పరిస్థితుల వల్లే చంటి పిల్ల వైద్యం కోసం ఒక రోజు కేటాయించడం సాధ్యపడలేదంటూ రోదించింది రాయ్ బాయ్. ఆ మాటలు విన్నాక అక్కడి పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో రాణి బంగ్‌కు తెలిసింది. వైద్యం అంటే కట్టు కట్టడం వ్యాధి తగ్గించేందుకు మందులివ్వడం కాదని.. వారి కష్టం నష్టం తెలుసుకుని వారి జీవనంలో మార్పు తేవడమే అసలైన వైద్యంగా భావించి పూర్తిగా ఆ తెగల బాగోగులకే అంకితమయ్యారు రాణి బంగ్.

చంటి బిడ్డల్ని బతికించాలని..

ఎన్నో పరిశోధనల ద్వారా 1984లో గృహ ఆధారిత నవజాత శిశుసంరక్షణ (హెచ్‌బిఎన్‌సిసి) పధతుల్ని కనుగొని గర్భిణులు, బాలింతలు ఇంట్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారి ఆదాయాలకు అనుగుణంగా ప్రత్యేక పద్ధతుల్ని ప్రవేశపెట్టారు. అప్పటి వరకు గ్రామంలో దాదాపు 300గా వున్న నవజాత శిశువుల మరణాల రేటును 121కి తగ్గించేందుకు కృషి చేశారు. గ్రామంలో మహిళలకి జీవశాస్త్రం, సామజిక శాస్త్రంపై అవగాహన కల్పించడంతో పాటు కొందరు మహిళలకి ఆయాలు, నర్సులుగా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గడ్చిరోలి గ్రామంలో మంచి ఫలితాలు సాధించిన హెచ్‌బిఎన్‌సిసి (హోమ్ బేస్డ్ న్యూ బోర్న్ అండ్ చైల్డ్ కేర్) విధానాన్ని భారత ప్రభుత్వం దేశంలో నవజాతశిశుమరణాలని తగ్గించేందుకు 12వ పంచవర్ష ప్రణాళిక నుంచి అమలుపరిచింది. యునిసెఫ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్‌ఒ)లచే ఆమోదించిన ఈ నవజాత సంరక్షణ విధానాన్ని నేడు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ అమలు చేస్తున్నారు.

కుటుంబ పెద్దగా..

కుటుంబాలు ఆరోగ్యంగా ఉండేందుకు 1990లో మద్యపాన నిషేధ ఉద్యమాన్ని ముందుకు నడిపించారు రాణి బంగ్. తీవ్రంగా కొనసాగిన ఈ ప్రజా ఉద్యమంతో 1992లో గడ్చిరోలి గ్రామంలో ప్రభుత్వం మద్యాన్ని నిషేధించింది. గ్రామీణ మహిళల్లో కాన్పు సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భనిరోధక పద్ధతులు, శిశుసంరక్షణ పద్ధతులపై సెర్చ్ (ఎస్ఇఎఆర్‌సిహెచ్) (సొసైటి ఫర్ ఎడ్యుకేషన్ యాక్షన్ అండ్ రీసెర్చ్) స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రజలకి తెలిసేలా చేశారు. ప్రజారోగ్యం కోసం ఎంతో మంది వలంటీర్లతో వివిధ గ్రామాల్లో రాణీ బంగ్ చేసిన కృషికిగాను ఎన్నో జాతీయ అంతర్జాతీయ అవార్డులతో పాటు మహారాష్ట్ర భూషణ్ అవార్డుని అందుకున్నారు రాణి బంగ్.

ఇండెక్స్

స్టార్.................3
ఆవకాయ్ అమ్మాయ్
విజేత........4
బతుకు స్టంట్
కార్టూన్ పంచ్......... 5
వింత లోకం...........10
దొంగా పోలీస్
ప్రత్యేకం............... 11
చిమ్మ చీకట్లో విందు
కవిత్వమ్..............14
చీకటి బిడ్డలు

ట్రాక్‌లోకి ఎప్పుడు?



అట్టమీది కథ...6

నా కళ్ళతో - 12
తారా విహారం

సేవా..................15
స్టడీ మాల్స్
కథ 16
స్నేహ హస్తం
తెలుసా...................19
కొబ్బరి తీరం
రుచి....................21
వావ్ పావ్
బాల నేస్తాలు............23
అతిపిన్న తబలా ప్లేయర్
పద వికాసం.....
....24

సాటానిక్ క్లబ్బులు

గుట్కా మహమ్మారితో వచ్చే క్యాన్సర్‌ను నివారించేందుకు ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ అమ్మకాలు నిలుపుదలకు కోర్టు ఆర్డరు తెప్పించిన ఇమ్రాన్‌కి అభినందనలు. అమెరికాలో స్టూడెంట్స్‌కు స్కూల్ తరగతుల పిదప సాటానిక్ క్లబ్బుల్లో చదువు డిఫరెంట్‌గా అనిపించింది. జాతీయ పతాకంపై, మూడురంగులు, ధర్మచక్రంపై వివరణ చాలాబాగుంది. అతి చిన్న మరుగుజ్జులు గ్రేబియల్, హూసినా వివాహ సన్నాహక నిశ్చితార్థపు వేడుకలు ఆసక్తిని కలిగించాయి.

- టి.సత్యనారాయణ మూర్తి, ప్రకాష్‌నగర్

దేవదాసీ టు సిఇఒ

దేవదాసీ టు సిఇఓ ఆకట్టుకుంది. సంస్కరణ వాదులకు ఇది ఎంతో ఆనందాన్ని కలిగించడమే కాకుండా మంచి ప్రేరణ కలిగిస్తూ ఆదర్శప్రాయంగా ఉంది. ఎంతో మంది దేవదాసీ దురాచారానికి బలయ్యారు. కర్ణాటకలో దేవదాసీ నిషేధ చట్టం పుణ్యమా అని ఈ ఆచారం దాదాపు కనుమరుగు కావడం హర్షదాయకం. సీతవ్వ బాధలు భరిస్తూ జీవితంలో ఒక్కో మెట్టు పైకెదుగుతూ మాస్ సంస్థ సిఇఒ స్థానం అధిష్టించడం

అభినందనీయం. చివరి పేజీలో మన బొమ్మలాట శిలప్పాదికారమ్‌లో చోటుచేసుకున్న ముచ్చటయిన బొమ్మలు స్వీడన్, బల్గేరియా, అమెరికా మొదలగు దేశాల్లో 1900 నాటికే కనిపించాయి. ఆ కళాకారులకు జోహార్లు.

- ఎన్. సత్యనారాయణాచార్యులు, తెనాలి

అంకురం మొలకెత్తిన వేళ

అంకురం మొలకెత్తిన వేళ కథ వేలాది ఎకరాల కథగా నిలిచింది. డబ్బు వల్ల ధనవంతులం అవుతాం కానీ ఆస్తిపరులుగా మారలేమన్నది రైతుల మనోవేదన. వారి ఆలోచనలో ధనవంతులు వేరు ఆస్తి పరులు వేరు అని తెలుసుకుని ఆశ్చర్యపోయాను. భూమి బిడ్డలు తిరిగి భూమినే వెతుక్కుంటారని రచయిత తెలియజేయటం బాగుంది. ఎందరో మహానుభావుల నుండి మన మువ్వన్నెల జెండా రూపాంతరమైందని,చివరిగా సురయ్యా బద్రుద్దీన్ త్యాబ్జీ గారి మూలంగ జాతీయ జెండా రూపుదిద్దుకున్నదన్న నిజాన్ని తెలుసుకున్నాం. దేవదాసీ వ్యవస్థ ఒక వెయ్యి మూడువందల సంవత్సరాలు నడిచినట్టు తెలుస్తోంది. భారత దేశంలో స్త్రీలని బానిసలుగా కొనడమూ అమ్మడమూ వుందని దేవదాసీల వ్యవస్థ రుజువుయిస్తున్నది. బాధితులైన దేవదాసీలు సంఘటితమై పోరాడినపుడే దాన్ని రూపుమాపగలమని సీతవ్వ నాయకత్వంలో దేవదాసీలు రుజువుచేశారు.

- ఇలిపిల్ల సూర్యనారాయణ, విజయవాడ

బిలియనీర్ బార్బర్

కుల వృత్తి ద్వారా ఆర్థికంగా నిలదొక్కుకున్న బిలియనీర్ బార్బర్ నేటి తరానికి మార్గదర్శి. పాడవోయి భారతీయుడా, మన మహిళా సుమో, కార్టూన్ పంచ్, ఇమానం రెస్టారెంట్ బాగున్నాయి.

- భవ్య, అనంతపురం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఆవకాయ్ అమ్మాయ్

రంగుల ప్రపంచంలోకి వెళ్లాలి... అందరి ఆదరాభిమానులు చూరగొనాలి ఇదీ ఆమె చిన్నప్పటి నుంచీ పెట్టుకున్న లక్ష్యం. తానూ ఓ తారనై వెలగాలని నిత్యం అనుకుంటూ ఉండేది. మరో పక్క సినిమా అనేది ఓ చెడు ప్రపంచం దానిలోకి పోతే తన ముద్దుల కూతురు ఏమైపోతుందనోనని ఆందోళన ఆ తల్లిదండ్రులది. తన లక్ష్యాన్ని వివరించి, ఒప్పించి తాను కన్న కలల ప్రపంచంలోకి ఓ చిన్న బిందువై అడుగుపెట్టింది. మొదట 'అవకాయ బిర్యానీ' సొంత భాషా చిత్రంలోనే నటించి మెప్పించింది. నేడు తమిళ్ ఇండస్ట్రీలో తారగా రాణిస్తోంది. ఆ అవకాయ్ అమ్మాయి అచ్చతెలుగు ముద్దుగుమ్మ బిందుమాధవి.

చిత్తూరు జిల్లా మదనపల్లిలో జన్మించింది బిందు. తన తండ్రి కమర్షియల్ ట్యాక్స్ డిపార్టుమెంట్ డిప్యూటీ కమిషనర్. దీని వల్ల ఆయన విధులు నిర్వహించిన తిరుపతి, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో బిందు మాధవి పెరిగింది.

- చెన్నైలోని వెల్లోర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆమె 2005లో బయోటెక్నాలజీ పూర్తి చేసింది.
- బిందుకి చిన్నప్పటి నుంచి సినిమా రంగమంటే చాలా ఇష్టం. అందువల్ల ఆ రంగంలోకి ఎలా ప్రవేశించాలన్న దానిపై అనేకసార్లు తర్జభర్జన పడిందట.
- రంగుల ప్రపంచంలోకి వెళ్లాలనే ఆమె కాలేజీ చదువుతున్న రోజుల్లోనే మోడలింగ్‌ను ప్రారంభించింది.
- కానీ బిందులో సినిమా రంగంలోకి వెళ్లడం ఆమె కుటుంబ సభ్యులకు ఎంత మాత్రమూ ఇష్టముండేది కాదు. తల్లిదండ్రులను ఒప్పించడం కోసం చాలా ప్రయత్నాలు చేసిందట కానీ వారు ఎప్పటికీ వినపోయే సరికి సుమారుగా ఎనిమిది నెలలు పాటు బిందు అమ్మానాన్నతో మాట్లాడడం మానేసింది.
- ఈ సమయంలో చెన్నైకు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ వెంకట్‌ను కలిసి తన జీవిత లక్ష్యాన్ని చెప్పింది. ఆయన బిందుకు చాలా సహాయ పడ్డారు.
- మోడలింగ్ చేస్తూనే బుల్లితెరపై అడ్వర్‌టైజ్‌మెంట్స్‌లో మెరిసేది. టాటా గోల్డ్, తనిష్క్ సంస్థల ప్రకటనల్లో బిందు చేసింది.
- మొదటిసారిగా శేఖర్ కమ్ముల 'ఆవకాయ్ బిర్యానీ' సినిమాకు నిర్వహించిన ఆడిషన్స్‌కు బిందు హాజరైంది. మొత్తానికి ఈ సినిమాలో చేసేందుకు అవకాశం లభించింది. ఇలా బిందు సినిమా కెరీర్ ప్రారంభమైంది. ఈ సినిమాకు నిర్మాత శేఖర్ కమ్ముల, దర్శకుడు అనిష్ కురువిల్లా. తర్వాత తమిళంలో చేరన్ దర్శకత్వంలో వచ్చిన 'పొక్కిసం'లో సహాయ నటిగా చేసింది.
- అదే సంవత్సరం సాయి రామ్ శంకర్ హీరోగా చేసిన 'బంపర్ ఆఫర్' సినిమాలో కథానాయికగా మెప్పించింది.
- తర్వాత అవకాశాలు తగ్గినా మోడలింగ్‌కు మాత్రం ఎప్పుడూ విరామం ఇవ్వలేదు. ఏడాది తర్వాత అర్జున్, రామ్ కలిసి చేసిన 'రామ రామ కృష్ణ కృష్ణ'లో మళ్లీ తళుక్కుమన్నది.
- 'అవకాయ్ బిర్యానీ' ఆమె నటన చూసి గౌతమ్ మీనన్ తన చిత్రం 'వెప్పమ్'కు కథానాయికగా ఎంపిక చేశారు. ఇందులో నాని, కార్తిక్ కుమార్, నిత్యా మీనన్ కలిసి నటించారు. తెలుగులో 'సెగ' పేరుతో విడుదలైంది.
- ఈ సినిమా తర్వాత పూర్తి కోలీవుడ్‌పై దృష్టి సారించింది. తమిళ్ చిత్రసీమలో అవకాశాలు కూడా ఆ విధంగానే రావడం విశేషం. 2011లో తెలుగులో పిల్ల జమీందార్'లో నటించింది.
- అప్పట్లో అక్కడ చేసిన 'కజుగు' చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపించింది. అదే విజయ పరంపర కేడీ బిల్లా కిల్లాడి రంగ', 'వరుతపాడత వాలిబార్ సంఘం' వంటి సినిమాలకూ అవకాశం లభించింది.
- 2014లో శింబుదేవన్ దర్శకత్వంలో వచ్చిన 'ఒరు కన్నియుమ్ మూను కలవానికలుమ్' చిత్రంలో చేసింది. గత ఏడాది రెండు చిత్రాలు, ఈ ఏడాది మరో రెండు చిత్రాలు చేసింది. ఇప్పుడు ఈమె నటించిన 'కలుక్కురయ్ మాప్లే' అనే తమిళ్ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్టుప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలో విడుదల కానుంది.

- కొప్పుశెట్టి దేవరాజు

అభిమాన దర్శకుడు : అనిష్ కురువిల్లా
నిర్మాత : శేఖర్ కమ్ముల
ఇష్టమని ఫుడ్ : సౌత్ ఇండియన్ వంటకాలు
అభిమాన నటి : కాజోల్
అభిమాన నటుడు : షారుఖ్ ఖాన్
ఫేవరెట్ కారు : బిఎండబ్ల్యూ
ఇష్టమైన దుస్తులు : చీర
ఇష్టమైన రంగు : నలుపు, తెలుపు
ఇష్టమైన ప్రదేశం : కేరళ



బతుకు స్టంట్

"ఆడదానివి. నేనే లేకపోతే నీకు జీవితం లేదు. బతుకు బస్టాండే. క్లబ్ డ్యాన్సులు చేస్తూ, ఒళ్లముకుని బతకాల్సిందే." పెళ్లయిన మూణ్నెళ్లకే భర్త వేధింపులు.. వెకిలి చేష్టల్ని గీతా టాండన్ భరించలేకపోయింది. భర్త అనే ప్రతి మాటకూ ఆమె గుండె పగిలేది. కళ్లు చెరువయ్యేవి. జీవితంలో ఏదో సాధించాలనే ఆలోచనలే తప్ప ఏం చేయాలనే దానిపై ఆమెకు స్పష్టత లేదు. భర్త నుంచి దూరంగా పారిపోయింది. ఒంటరి మహిళగా ఎన్నో సమస్యలను ఎదుర్కొంది. ముంబై మహానగరంలో బతుకు పోరాటం చేస్తున్న గీతా టాండన్ కథ తెలుసుకున్న ఒకావిడ ఆమె వద్దకు వచ్చింది. "నీవు చూడడానికి టామ్ బాయ్‌లాగున్నావు. సినిమాల్లో స్టంట్స్ చేస్తావా!" అని అడిగింది. రెండు సంభాషణల మధ్య గీతా జీవితం ఒక ఎత్తు అయితే.. ఆ రెండో సంభాషణ తర్వాత స్టంట్ ఉమన్‌గా ఆమె కొత్త అవతార్ మరో ఎత్తు. టివి సీరియల్ 'షకీరా'తో మొదలైన ఆమె బతుకు స్టంట్ బాలీవుడ్ యాక్షన్‌కు స్టెంట్ అవుతోంది. హీరోయిన్‌కు హీరోయిజమ్ పెంచుతోంది.

బాల్యంలో తండ్రి, సోదరుడు.. పెళ్లయిన తర్వాత భర్త.. వృద్ధాప్యంలో కొడుకు.. ఇలా మహిళ సామాజిక, ఆర్థిక స్వేచ్ఛకు ప్రతిబంధకంగా పితృస్వామ్య వ్యవస్థ అడుగడుగునా అడ్డు పడుతూనే ఉంటోంది. సంప్రదాయాల రూపంలో పైకి కనిపించకుండా మహిళను మానసికంగా మరింత బలహీనురాలిని చేస్తోంది. గీతా టాండన్ వాటిని ఛేదించింది. ఉట్టికి ఎగిరింది. ఆకాశాన్నీ దాటింది. భవనాలు, పర్వతాలు, ఎత్తైన భవనాల చివరపుటంచుల మీద నుంచి ఎలాంటి బెరుకు లేకుండా స్టంట్‌లు చేస్తూ బాలీవుడ్ అంతా ప్రకంపనలు సృష్టించింది.

అర్ధాకలి నుంచి అర్ధాంతర పెళ్లి వరకు

గీతాకు తొమ్మిదేళ్లపుడు తల్లి చనిపోయింది. తండ్రి ఉన్న నలుగురు సంతానాన్ని పట్టించుకునేవాడు కాదు. రెండు ముద్దలు నోటికందని ఆ తోబుట్టువులకు ఇక బడి మాట నోటి కాడే ఆగిపోయింది. ఆకలి మంటను ఆటల, పాటల్లో చల్లార్చుకునేది. తనకంటే వయస్సులో పెద్ద కుర్రాళ్లతో కలిసి క్రికెట్ ఆడేది గీతా. అక్క వారించినా గీతా వినేది కాదు. షర్ట్, ప్యాంట్ వేసుకుని టామ్‌బాయ్‌లా ఇంటికి మగదిక్కు అయ్యింది. బండ పని చేస్తూ అంతోకొంతో సంపాదించి అక్క చేతికిచ్చేది. అక్క చెల్లెళ్ల గురించి తండ్రితో వాదులాడేది. ఎదురిస్తోందన్న కోపంతో ఆమెను వదిలించుకోడానికి రెండే రోజుల్లో ఓ సంబంధం కుదుర్చుకుని గీతకు పదిహేనేళ్ల వయస్సుకే పెళ్లి చేసేశాడు. తోడుగా నిలుస్తాడనుకున్న భర్త ఆమె బతుకును తోలుబొమ్మలాట చేశాడు. తాగివచ్చి తీవ్రంగా కొట్టేవాడు. రోజూ అతడు చేసే చిత్ర హింసలకు కళ్లు తిరిగి పడిపోయేది. రోజురోజుకూ గృహ హింస ఎక్కువైపోయింది. జీవితంపై విరక్తితో ఆమె రెండు సార్లు ఆత్మహత్యాయత్నం చేసింది. ఆ తర్వాత గర్భిణి అయినా కూడా మానసికంగానూ, శారీకరంగానూ అతడు తీవ్రమైన రాక్షసత్వాన్ని ప్రదర్శించేవాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్తే వాళ్లు వెనక్కి పంపించేశారు. దిక్కు తోచక సోదరి యింటికి వెళ్లింది. అయినా భర్త వెంటాడుతూనే ఉన్నాడు. అక్కసుతో ఒకరోజు గీత బావగారి రిక్షాను తగలెట్టేశాడు.

దూరతీరాల్లో..

ఇక భర్తతో ప్రమాదమేనని ఇద్దరి పిల్లలతో ముంబై చేరింది. ఓ గుడిలో తలదాచుకుంది. పని కోసం కనిపించిన వారందరినీ ప్రాధేయపడింది. చదువు లేకపోవడంతో పని దొరకలేదు. చివరకు ఓ వారం పాటు ఓ హోటళ్లో పనికి కుదిరింది. రోజుకు 250 రొట్టెల్ని చేసేది. తర్వాత ఓ ప్రదేశంలో పని కోసం వెళ్లింది. అక్కడున్న మహిళలు వృద్ధ మహిళలకు మసాజ్ చేస్తావా అని అడగడంతో కాదనలేకపోయింది. మసాజ్ పేరిట పడుపు వృత్తిని నడుపుతోన్న పార్లర్ అదని ఆమెకు తెలియదు. అక్కడ వాతావరణం అర్థమవడంతో భయపడి అక్కడి నుంచి తప్పించుకుంది. ఎన్నో ప్రయత్నాలు చేసి చివరకు ఓ భాంగ్రా డాన్సు గ్రూపులో జాయిన్ అయ్యింది. అలా మొదలైన ఆమె ప్రస్థానం బాలీవుడ్‌లో స్టంట్ వుమన్‌గా స్థిర పడే వరకు ఎన్నో ఆటుపోట్లను చూసింది. బాలీవుడ్‌లో స్థిరపడేందుకు చాలా ప్రమాదకరమైన సాహస కృత్యాలనే చేసింది. రెండో షూటింగ్‌లోనే మంటల్లో నుంచి దూకే ఆ స్టంట్‌లో తప్పిదం జరిగి ఆమె ముఖం కాలిపోయింది. ఆమె పెదాలు, కనురెప్పలు, నుదురు మంటల ధాటికి కందిపోయాయి. దాంతో రెండు నెలలపాటు వైద్యం తీసుకోవాల్సి వచ్చింది. మరో స్టంట్‌లో భవంతి నుంచి జారి పడి వెన్నెముకకు గాయాలయ్యాయి. అయినా ఆ సాహస కెరీర్‌ను వదల్లేదు. హైస్పీడ్ కార్ చేజ్ స్టంట్లను చేసింది. ఆరేళ్ల స్టంట్ ఉమన్ జీవితంలో గగుర్పాటు కలిగించే వందలాది స్టంట్లతో రికార్డు సృష్టించింది.

- క.వి.చుసరా

8519834468

కార్టూన్ పంచ్



నవ్వుల్ - పువ్వుల్

ఫస్ట్ క్లాస్

తండ్రి : ఒరేయ్! నీకెందుకు మార్కులు అంత తక్కువొచ్చాయ్. పక్కింటి పింకీని చూడరా ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యింది.

కొడుకు : అలా చూడటం వల్లే నేను ఫెయిలయ్యింది.

కిసుక్కు

భార్య: బయట ఎండ, వానా రెండూ లేవు మరి ఆ గొడుగెందుకు వేసుకెళుతున్నారు.

భర్త: మనకి అప్పులు ఉన్నాయిగా...!

గులాబ్ జామ్

కిరణ్: ఏంట్రా! గులాబీ, జామ మొక్కల్ని కలిపి నాటుతున్నావ్

వెంగళప్పు: రెండూ కలిపి నాటితే చెట్టు పెద్దదయ్యాక గులాబ్ జామ్‌లు కాస్తాయని..

పది నిమిషాలు



సూరి : ఓ బైక్ షోరూమ్‌కెళ్లి... స్పోర్ట్స్ బైక్‌లేమైనా చూపించండి.

సేల్స్‌మెన్ : ఇదిగోండి సార్! ఈ బైక్ చూడండి. మీరు ఇంటి దగ్గర స్టార్ట్ చేస్తే పది నిమిషాల్లో ఆఫీసులో ఉంటారు.

సూరి : అయితే ఇది నాకొద్దులే... వేరేది చూపించు.

ఇన్సూరెన్స్

భార్య: నెల రోజుల పాటు నా చేతులతో వంట చేసి వడ్డిస్తే నాకు ఏమిస్తారు?

భర్త: ఎల్ఐసి వాళ్లు నా ఇన్సూరెన్స్ డబ్బులిస్తారు.

అట్టమీది కథ

పి.వి.సింధు

ట్రాక్‌లోకి ఎప్పుడు ?

- చొప్పరపు కృష్ణారావు
8498084018

డిజైన్: టి. కర్మాకర్

భారత్... జనాభా పరంగా ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశం.. దాదాపు 133 కోట్ల మంది జనం.. రియో ఒలింపిక్స్‌కు వెళ్ళిన క్రీడాకారులు 119 మంది. సాధించిన పతకాల సంఖ్య చూస్తే మాత్రం అవమాన భారంతో తల దించుకోవాల్సిందే.

నాలుగేళ్లకోసారి జరిగే ప్రపంచ క్రీడల పండుగ ఒలింపిక్స్‌లో కొండంత ఆశతో పాల్గొనటం, నిరాశ నిస్పృహలతో తిరిగిరావటం... ఇది దశాబ్దాల కాలంగా జరుగుతున్న తంతే. మనకన్నా వందల రెట్లు చిన్నదేశాలు అద్భుతమైన క్రీడా ప్రతిభతో మెడల్స్‌ను కొల్లగొడుతుంటే మనం మాత్రం కాస్తంత సిగ్గు నటిస్తూ ఈ సారి 'ఇరగదీసేద్దాం' అనే ప్రతినలు తీసుకోవడం అలవాటయ్యింది. తరువాత కొద్ది రోజుల్లోనే మన సంకల్పాలను తీసి గట్టున పెడుతున్నాం. ఇంతకూ క్రీడల్లో ఇంత దయనీయ పతక దారిద్ర్యానికి కారణాలేంటి? మన క్రీడారంగం ట్రాక్‌లోకి వచ్చేదెప్పుడు?

ఇదే ఈ వారం అట్టమీది కథ.

అమెజాన్ గడ్డ రియో డిజెనీరో వేదికగా ముగిసిన 2016 ఒలింపిక్స్ క్రొయేషియా, జమైకా, క్యూబా, ఆర్మేనియా, స్లొవేనియా, చెక్‌రిపబ్లిక్, ఫిజీ, కొసోవో లాంటి బుల్లిదేశాలకు బంగారు పతకాల రూపంలో సంతోషాన్ని కలిగిస్తే... ప్రపంచంలోనే పెద్ద దేశాల్లో ఒకటయిన భారత్‌కు మాత్రం తీవ్ర నిరాశనే మిగిల్చింది. భారత ఒలింపిక్స్ చరిత్రలోనే, గతంలో ఎన్నడూ లేనంతగా భారీ బృందంతో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. మన క్రీడాకారులు పతకాల పట్టికలో దేశాన్ని సగర్వంగా నిలపలేకపోయారు. దేశం కోసం తుదివరకూ పోరాడినా అరకొర పతకాలతోనే తిరిగి వచ్చారు. కనీసం గత ఒలింపిక్స్‌లో సాధించిన పతకాల సంఖ్యను నిలుపుకోలేకపోయారు.

ఎందుకిలా?

అపార జనసంపద కలిగి భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచే భారత్... క్రీడారంగంలో మాత్రం ఇంకా శైశవ దశలోనే ఉందనటానికి

ఒలింపిక్స్ ఫలితాలను మించిన నిదర్శనం మరొకటి ఉండదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, క్రీడా సంఘాల రాజకీయాలు, మధ్యతరగతి తల్లిదండ్రుల సగటు మనస్తత్వమే మన పతక దారిద్ర్యానికి కారణాలని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

అమెరికా, గ్రేట్ బ్రిటన్, జపాన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, చైనా, క్యూబా, రష్యా, సోవియట్ మాజీ రిపబ్లిక్ దేశాలు, ఫిజీ, కెన్యా, ఇరాన్, థాయ్ లాండ్ ... ఈ దేశాలన్నీ ఇబ్బడిముబ్బడిగా పతకాలను సొంతం చేసుకున్నవే. భారత్ పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది.

ఏ క్రీడ చూసినా ఏమున్నది గర్వకారణం...

1896లో ఆధునిక ఒలింపిక్స్ తొలిక్రీడలు ప్రారంభమైతే... 1900 ప్యారిస్ ఒలింపిక్స్ నుంచే భారత్ పాల్గొంటూ వచ్చింది. అయినా క్రీడాసంస్కృతిని అలవరచుకోలేకపోయింది. పటిష్టమైన క్రీడావ్యవస్థను ఏర్పాటు చేసుకోలేకపోయింది. 69 సంవత్సరాల స్వతంత్ర భారతంలో క్రీడల పరిస్థితి మరింతగా దిగజారిపోయింది.

క్రీడలు ఉమ్మడి జాబితా అంశంగా ఉండటంతో అటు కేంద్రానికి, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టని విషయంగా మిగిలిపోయింది. కేంద్రంలో ఒక క్రీడావిధానం, ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికి ప్రత్యేక క్రీడావిధానం ఉండటంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా తయారయ్యింది.

ఒలింపిక్స్‌లో ఎనిమిది బంగారు పతకాలు అందించిన హాకీని జాతీయక్రీడగా ఎంపిక చేసుకొన్నా... వలసవాద దేశం ఇంగ్లండ్ అందించిన వ్యాపార క్రీడ క్రికెట్ అనధికారిక జాతీయ క్రీడగా నీరాజనాలు అందుకుంటోంది. మిగిలిన క్రీడల పరిస్థితి ఊడలమర్రి మాటున ఎదుగూబొదుగూ లేని పిచ్చిమొక్కల చందంగా మారింది.

గ్లోబల్ గేమ్స్ క్రికెట్, టెన్నిస్, బ్యాడ్మింటన్, సాంప్రదాయ క్రీడలు చదరంగం, కుస్తీ, విలువిద్య లాంటి పలుక్రీడల్లో బలమైన పునాదులు ఉన్నా దేశానికి ఒరిగిందేమీ కనిపించడంలేదు.

ఈ భూగోళంలోని 206 దేశాలలో నెంబర్ వన్ క్రీడగా ఉన్న ఫుట్‌బాల్‌లో సైతం భారత్ ర్యాంకు 120కి పైనే అంటే ఆశ్చర్యపోవడం మనవంతే అవుతుంది. బ్యాడ్మింటన్, డైవింగ్, షూటింగ్, జిమ్నాస్టిక్స్ లాంటి క్రీడల్లో చైనా; కుస్తీలో ఇరాన్; బాక్సింగ్‌లో థాయ్‌లాండ్; ఫుట్‌బాల్‌లో బ్రెజిల్, అర్జెంటీనా; ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో జమైకా, కెన్యా లాంటి దేశాలు రాణిస్తుంటే.. మనదేశానికి ప్రత్యేకంగా ప్రావీణ్యం ఉన్న క్రీడ ఒకటంటూ లేకపోడాన్ని మించిన విషాదం మరొకటి ఉండదు.

జాతీయక్రీడ హాకీలో భారత్ ఆరో ర్యాంకులో ఉన్నా ఒలింపిక్స్‌లో పతకం సాధించే సత్తాను ఏనాడో కోల్పోయింది.



సాక్షి మాలిక్

క్రీడాసంఘాల నిర్వాకం

దేశంలో క్రీడారంగ అభివృద్ధి కోసం జాతీయక్రీడా ప్రాధికార సంస్థతో కలసి పనిచేయాల్సిన జాతీయ ఒలింపిక్ సంఘం, దాని అనుబంధ సంఘాల నిర్వాకం సైతం మన క్రీడారంగ పతనానికి కారణమని చెప్పాలి.

హాకీ నుంచి కుస్తీ వరకూ, కబడ్డీ నుంచి సైక్లింగ్ వరకూ ఏ క్రీడను చూసినా ప్రాంతీయ తత్వం, ముఠా తగాదాలు, ఆశ్రిత పక్షపాతం, అవినీతి, నిధుల దుర్వినియోగం లాంటి అవలక్షణాలతో కునారిల్లుతూ కనిపిస్తాయి. దేశంలోని వివిధ క్రీడాసంఘాలు రాజకీయనాయకుల కబ్జాలో ఇప్పటికీ బంధీలుగానే ఉన్నాయి.

◆ క్రీడా దినోత్సవం అంటే అంత అలుసా?

హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి రోజైన ఆగస్టు 29న మనం ఏటా జాతీయ క్రీడోత్సవాన్ని జరుపుకోవడం సాంప్రదాయంగా వస్తోంది.

అయితే యువజన జనాభా ఎక్కువగా ఉన్న మనదేశంలో క్రీడాదినోత్సవం గురించి తెలిసిన దానికంటే వేలెంటైన్స్ డే, ఫ్రెండ్‌షిప్ డే గురించి ఎక్కువగా తెలుసని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆగస్టు 15, జనవరి 26, నవంబర్ 14 తేదీలకు మన ప్రభుత్వాలు ఇస్తున్న ప్రాధాన్యం ఆగస్టు 29కు ఏమాత్రం ఇవ్వడంలేదు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఏ మాత్రం పట్టించుకోని ప్రభుత్వాలు ఇక క్రీడా రంగాన్ని ఎందుకు పట్టించుకుంటాయని విమర్శించేవారు లేకపోలేదు.

ఒలింపిక్స్‌లో భారత్‌కు అత్యధిక పతకాలు అందించిన క్రీడ హాకీ మాత్రమే. అంతేకాదు హాకీ క్రీడకు జాతీయ క్రీడ హోదా ఇచ్చి ప్రభుత్వం గౌరవించింది.

1928 ఆమ్‌స్టర్‌డామ్ ఒలింపిక్స్ నుంచి 1936 బెర్లిన్ ఒలింపిక్స్ వరకూ భారత్‌కు మూడు బంగారు పతకాలు అందించడంలో ప్రధాన పాత్ర వహించిన హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ స్మృతిగానే జాతీయ క్రీడాదినోత్సవాన్ని జరుపుకుంటూ వస్తున్నా... యువతలో స్ఫూర్తి నింపడంలో మాత్రం మన ప్రభుత్వాలు విఫలమవుతూ వస్తున్నాయి. ధ్యాన్ చంద్ అంటే ఎవరు? జాతీయ క్రీడాదినోత్సవం ఎప్పుడు? అన్న ప్రశ్నలకు నేటితరం యువతలో ఎంతమంది సమాధానం చెప్పగలరన్నది అనుమానమే.

ప్రపంచంలోని వివిధ దేశాలు తమతమ జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా జరుపుకొంటుంటే... మన దేశంలో మాత్రం దానికి భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. జాతీయ క్రీడా సంఘాలు, క్రీడామంత్రిత్వ శాఖలు ఓ మొక్కుబడి తంతుగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నాయి. కళాత్మక ఆసియా శైలి హాకీకే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మేజర్ ధ్యాన్ చంద్‌కు మనం తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వడం లేదన్నది ముమ్మాటికి నిజంగాక నిజం.

మేజర్ ధ్యాన్‌చంద్

క్రీడాకారుల ఎంపిక నుంచి శిక్షణ వరకూ రాజకీయాలే విలయతాండవం చేస్తున్నాయి. జాతీయ స్థాయిలోనే కాదు.. వివిధ రాష్ట్రాలలోని క్రీడాప్రాధికార సంస్థలు సైతం రాజకీయ ప్రముఖుల, బ్యూరోక్రాట్ల కనుసన్నలలో పనిచేయాల్సి వస్తోంది.

క్రీడలతో ఏ మాత్రం సంబంధంలేని వ్యక్తులు జాతీయ క్రీడారంగాన్ని, క్రీడాసంఘాలను భ్రష్టుపట్టిస్తున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది.

ఒలింపిక్స్‌కు ముందు హడావిడి చేయటం, ముగిసిన తర్వాత సమీక్షల తంతు నిర్వహించడం ఓ సాధారణ విషయంగా మారిపోయింది.

అథ్లెట్లు అలా.. అధికారులు ఇలా..

రియో ఒలింపిక్స్ మహిళల మారథాన్ రేస్‌లో పతకం సాధించడం సంగతి అటుంచి భారత అధికారుల నిర్లక్ష్యం వల్ల తాను రేస్ పూర్తి చేయకుండానే ప్రాణాలు కోల్పోయేదాన్నని భారత మారథాన్ రన్నర్ జైషా ఆరోపించింది. అయితే వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోడానికే జైషా ఈ తరహా ఆరోపణలు చేసిందంటూ అమెచ్యూర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ అధికారులు ఎదురు దాడికి దిగారు. రియో ఒలింపిక్స్ మహిళల మారథాన్ రేస్ నిప్పులు చెరిగే ఎండ వేడిమి వాతావరణంలో ప్రారంభమయ్యింది. మొత్తం 42 కి.మీ మారథాన్ రేస్ మార్గంలో ప్రతి 2 కి.మీ.లకూ మంచి నీటితో పాటు ఎనర్జీ డ్రింక్స్, శీతల పానీయాల స్టాల్స్ ఏర్పాటు ఉంటుంది. ఈ స్టాల్స్‌ను నిర్వాహక సంఘం మాత్రమే ఏర్పాటు చేస్తుంది. కావాలనుకొంటే ఆయాదేశాల బృందాలు సైతం తమకు కావాల్సిన పానీయాలతో స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకొనే వీలుంది. అయితే భారత రన్నర్లు జైషా, కవితా రౌత్ కోసం భారత అధికారులు ఏవిధమైన ఏర్పాట్లు చేయలేదు. భారత అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తాను విఫలమయ్యానని జైషా ఆరోపిస్తోంది. మరోవైపు భారత బృందం అధికారులు మాత్రం జైషా ఆరోపణలను ఖండించారు. పోటీకి ఒక రోజు ముందే తాము కవిత, జైషాలకు 16 ఖాళీ బాటిల్స్ ఇచ్చామని, తమకు నచ్చిన ఎనర్జీ డ్రింకులతో నింపి ఇస్తే దారి పొడుగునా స్టాల్స్‌లో ఉంచుతామని చెప్పామని.. కానీ వారు తమకు అలాంటి ఏర్పాటు అవసరం లేదని చెప్పారని అంటున్నారు. విఫలమైన రన్నర్లు ఇలా ఆరోపించడం.. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోడానికి మాత్రమే అధికారులు మండిపడుతున్నారు. అలా అయితే జైషా దప్పికతోనే చివరికంటా రన్ చేసి రేసు పూర్తి చేసింది. అది ఆమె క్రీడా స్ఫూర్తికి నిదర్శనం. 42 కి.మీ.లు అలా పరుగెత్తడం బాధాకరం. జైషా తీవ్ర అలసటతో స్పృహ తప్పిపడిపోయింది. దీంతో నిర్వాహక సంఘం అధికారులు గ్లూకోజ్ ఎక్కించడంతో జైషా ప్రాణాలతో బయటపడింది. అలాంటి క్రీడాకారులపై అధికారులు మండిపడటం ఎంత వరకు సమంజసం. స్టాల్స్ అవసరం లేదని క్రీడాకారులు చెప్పారని చేతులు దులుపుకోవడం విమర్శలకు దారి తీస్తోంది. మధ్య మధ్యలో ఏమీ తీసుకోకుండా మారథాన్ రన్‌లు ఎవరు చేయగలరు. నిర్వాహకులు స్టాల్స్ సక్రమంగా నడుపుతున్నారో లేదో చూసుకోవాల్సిన కనీస బాధ్యత భారత క్రీడా అధికారులది.

పల్లెల్లో ప్రతిభ.. పట్టణాల్లో సౌకర్యాలు..

ఒలింపిక్స్‌లో భారత వైఫల్యానికి, క్రీడా రంగంలో ఎదుగూ బొదుగూ లేకుండా పోవడానికి ఎన్నో కారణాలున్నా... ప్రతిభావంతులైన క్రీడాకారులు దేశంలోని గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైపోతుంటే వారికి అవసరమైన అత్యాధునిక శిక్షణ సౌకర్యాలు పట్టణాలలోనే కేంద్రీకృతమై ఉంటున్నాయి. తెలుగు రాష్ట్రాలలోని పెద్ద నగరాలు, పట్టణాలకే పరిమితమైన మినీ స్టేడియాలు, ఆధునిక క్రీడా సదుపాయాలను.. మండల, జిల్లా కేంద్రాలకు విస్తరించనంత వరకూ ఆశించిన ఫలితాలు సాధించలేమని నిపుణులు పదే పదే చెబుతున్నా... రకరకాల యజ్ఞాలు చేస్తున్న మన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తనట్లే ఉంటున్నాయి. ఒకటి అర పతకాలు సాధించే ఒలింపియన్లను సత్కరించడానికి పోటీ పడే తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడా రంగ మౌలిక సదుపాయాల కల్పనలోనూ పోటీ పడితే నవ్యాంధ్ర లక్ష్యం నెరవేరినట్లవుతుంది.

పేదరికం క్రీడలకు శాపం

రియో ఒలింపిక్స్ రజత విజేత పివి సింధుపై కోట్ల వర్షం.... కుస్తీ కాంస్య విజేత సాక్షి మాలిక్, జిమ్నాస్టిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన దీపా కర్మాకర్‌లకు లక్షలకు లక్షల రూపాయిల నజరానా... పంజాబ్ హ్యాండ్ బాల్ కమ్ కబడ్డీ ప్లేయర్ పూజా చౌహాన్.... హాస్టల్ వసతికి ఫీజులు చెల్లించలేక ఆత్మహత్య. ఇలాంటి వైపరీత్యాలు.. భారత్‌లో మాత్రమే చోటు చేసుకుంటూ ఉంటాయి. ఓ వైపు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడం ద్వారా దేశం పరువు కాపాడిన ముగ్గురు మహిళా అథ్లెట్లపై కానుకలు కురిపించడం, అవార్డులు రివార్డులతో గౌరవించుకోవడం అభినందనీయమే. అయితే చదువుతో పాటు ప్రపంచ స్థాయి క్రీడాకారిణిగా ఎదగాలని కలలు కన్న 20 ఏళ్ల పంజాబీ యువతి పూజ.. పేదరికంతో చదువు కొనసాగించలేక ప్రధాని

జాతీయ క్రీడలో వెల వెల

జాతీయక్రీడ హాకీలో భారత్ అంచనాలను ఏమాత్రం అందుకోలేకపోయింది. మహిళల విభాగంలో 36 ఏళ్ల విరామం తర్వాత అర్హత సంపాదించిన భారత్ గ్రూప్ లీగ్ దశలో దారుణంగా విఫలమయ్యింది. కనీసం ఒక్క విజయమూ సాధించలేకపోయింది.

ఇక పురుషుల విభాగంలో పతకం ఆశలు రేపిన భారతజట్టు క్వార్టర్స్ వరకూ గొప్పగా పోరాడినా... ఆ తర్వాత తేలిపోయింది. ఐర్లాండ్, అర్జెంటీనా జట్లను ఓడించి, కెనడాతో పోటీని డ్రాగా ముగించడం ద్వారా నాకౌట్ రౌండ్ చేరిన భారత్.... క్వార్టర్ ఫైనల్లో మాత్రం బెల్జియం చేతిలో పరాజయం చవిచూడక తప్పలేదు. 12 ఏళ్ల విరామం తర్వాత ఒలింపిక్స్‌లో హాకీ జట్టు పాల్గొందనే ఆనందం ఎంతో సమయం నిలవలేదు. కేవలం రెండు విజయాలు సాధించడం మాత్రమే భారత్‌కు ఊరట కలిగించే విషయం.

1928 ఆమ్‌స్టర్‌డామ్ ఒలింపిక్స్ నుంచి 1980 మాస్కో ఒలింపిక్స్ వరకూ అత్యధికంగా ఎనిమిది బంగారు పతకాలు గెలుచుకొన్న భారత్ హాకీలో ఇకముందు కనీసం ఓ కాంస్య పతకం గెలుచుకోడానికి ఎన్ని దశాబ్దాలు వేచి చూడాలో మరి!

మహిళా హాకీ బృందం

మరోసారి మహిళా అథ్లెట్లే దిక్కు

రియో ఒలింపిక్స్‌లో భారత్‌కు మరోసారి మహిళా అథ్లెట్లే పెద్ద దిక్కయ్యారు. పదహారేళ్ల క్రితం సిడ్నీలో ముగిసిన ఒలింపిక్స్‌లో పురుష అథ్లెట్లందరూ కనీసం ఒక్క పతకమూ సాధించలేకపోయారు. అయితే మహిళల వెయిట్ లిఫ్టింగ్‌లో తెలుగుతేజం కరణం మల్లీశ్వరి కాంస్య పతకం సాధించడం ద్వారా భారత్‌కు పతకాల పట్టికలో చోటు కల్పించి పరువు నిలిపింది. మళ్లీ అదే పరిస్థితి రియో ఒలింపిక్స్‌లో పునరావృతమైంది. ఈ ఒలింపిక్స్‌లో పురుష క్రీడాకారులు ఒక్కటంటే ఒక్క పతకం సాధించలేక పోయారు. సింధు, సాక్షి పతకాలు సాధించకుండా ఉండి ఉంటే క్రీడల్లో దేశం పరువు ప్రతిష్టలు అట్లాంటిక్ సముద్రంలో కలసిపోయి ఉండేవి.

నరేంద్ర మోదీకి లేఖ రాసి మరీ ఆత్మహత్యకు పాల్పడటాన్ని మించిన విషాదం మరొకటి లేదు. పాటియాలాలో జరిగిన ఈ సంఘటన ప్రభుత్వాలకు తలవంపులని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఒలింపిక్స్‌లో ఒకటి రెండు పతకాలు సాధించిన క్రీడాకారులను ఆకాశానికి ఎత్తేయడం ఎంత ప్రధానమో... తగిన ప్రోత్సాహం లేక... బీదరికంతో పోరాడుతున్న పూజ లాంటి దిగువస్థాయి క్రీడాకారులకు అండగా నిలవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పైన మాత్రమే కాదు మన సమాజంపైన కూడా ఉంది. రోజుకు 120 రూపాయల ఆదాయం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన పూజ చదువు కొనలేక, ఆటలు కొనసాగించలేక ప్రాణాలు తీసుకోడం.. మనదేశం చేసుకున్న దౌర్భాగ్యం కాక మరేమిటి.

పతకాలు సాధించాక సన్మానాలు చేయడం కాదు. ప్రాథమిక స్థాయిలోనే ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. మన దేశంలో క్రీడాసంస్కృతికి చిరునామాగా ఉండే పంజాబ్ రాష్ట్రంలోనే ఇలాంటి సంఘటన చోటు చేసుకోడానికి మించిన విషాదం మరొకటి ఉండదు.

పేరు అథ్లెట్లది.. జల్సా అధికారులదీ..

ఒలింపిక్స్, కామన్వెల్త్ గేమ్స్, ఆసియన్ గేమ్స్ లాంటి పోటీల్లో సాధారణంగా క్రీడాకారులే పాల్గొంటారని అందరూ అనుకొంటారు. అది నిజం కూడా. అయితే భారత క్రీడారంగం విషయానికి వస్తే మాత్రం పరిస్థితి వేరుగా ఉంటుంది. అంతర్జాతీయ క్రీడోత్సవాలకు ప్రతినిధి బృందాల పేరుతో బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులే అధిక సంఖ్యలో పాల్గొంటూ రావడం మనదేశంలో సాధారణ విషయమే. దేశానికి పతకాలు తెచ్చే క్రీడాకారులు, అథ్లెట్ల కంటే ప్రభుత్వ ఖర్చుతో విహార యాత్రలకు వెళ్లే అధికార గణంతో భారత క్రీడా వ్యవస్థ భ్రష్టు పట్టిపోతోంది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో 83 మంది సభ్యుల బృందం అధికారికంగా పాల్గొంటే ప్రభుత్వ ఖర్చులతో అనధికారికంగా పాల్గొన్న నాయకులు, బ్యూరోక్రాట్లే ఎక్కువని తేలింది. అంతేకాదు రియో ఒలింపిక్స్‌లో 119 మంది సభ్యుల భారీబృందంతో పాల్గొంటే సహాయ సిబ్బంది, సాంకేతిక అధికారులు, ఇతర ప్రముఖులు ఎక్కువగా హాజరుకావడం విశేషం.

అమ్మానాన్నల అతి జాగ్రత్త

మనదేశంలో క్రీడారంగం ఎదుగూబొదుగూ లేకుండా ఉండిపోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, క్రీడాసంఘాలు మాత్రమే కాదు.. సామాజిక, కుటుంబ, విద్యావ్యవస్థలు సైతం కారణమే అనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

చక్కగా చదువుకొంటే ఏ డాక్టరో, సాఫ్ట్‌వేర్ ఇంజనీరో అయితే తమతమ జీవితాలు ప్రశాంతంగా సాగిపోతాయని భావించే సగటు అమ్మానాన్నలే మనసమాజంలో ఎక్కువశాతం కనిపిస్తారు. క్రీడలు "కూటికా గుడ్డకా" అంటూ నిరుత్సాహ పరచేవారే ఎక్కువగా కనిపిస్తారు.

ఇక మన విద్యావ్యవస్థను చూస్తే... సింగిల్ బెడ్ రూమ్ పాఠశాలలు, డబుల్ బెడ్‌రూమ్ కళాశాలలతో విద్యావ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా విలసిల్లుతోంది. లేగ దూడల్లా, లేడిపిల్లల్లా చెంగుచెంగున ఎగురుతూ ఆడుకోవాల్సిన పిల్లలకు క్రీడామైదానాలే కరువైపోయాయి. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన రకరకాల టీవీ చానెళ్ల పుణ్యమా అంటూ పిల్లలు క్రీడలంటే ఏమిటి అని ప్రశ్నించే దయనీయమైన పరిస్థితి నెలకొంది. దీనికితోడు ప్రపంచీకరణ కారణంగా అంటూ క్రీడలు సైతం లాభసాటి, ఘరానా వ్యాపారంగా మారిపోడంతో ప్రతిభావంతులైన క్రీడాకారులు తగిన ప్రోత్సాహం లేక ఆటలకో నమస్కారం అంటూ మిన్నకుండిపోవాల్సి వస్తోంది.

ప్రస్తుత పరిస్థితిని అధిగమించాలంటే కేంద్ర,

మరి ఏం చెయ్యాలి?

రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సమాజంలోనూ ఓ సంకల్పం అంటూ ఉండి తీరాలి. దేశమంతా ఒకే క్రీడావిధానం ఉండేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. క్రీడారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో అధిక ప్రాధాన్యమివ్వాలి. తలకు ఐదు పైసలు కాదు.. యాభై రూపాయల వంతున ఖర్చు చేస్తూ ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి బాలుడూ, బాలిక తమకు నచ్చిన ఏదో ఒక క్రీడ ఆడి తీరేలా నిబంధన ప్రవేశపెట్టాలి. అంతేకాదు ఆంగ్లం, తెలుగు, గణితం, సామాన్యశాస్త్రం లానే క్రీడలనూ నిర్బంధ పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. ఆటస్థలం ఉంటేనే పాఠశాలలకు అనుమతి ఇవ్వాలి.

తల్లిదండ్రులు సైతం తమ పిల్లల్ని ఆటలు ఆడే విధంగా ప్రోత్సహించాలి. ఆటల వల్ల చక్కటి ఆరోగ్యంతో పాటు విద్యా ప్రమాణాలు, మానసిక స్థితి సైతం మెరుగుపడతాయన్న వాస్తవాన్ని గుర్తించాలి. మనదేశంలో డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రసాంకేతిక నిపుణులు, గొప్ప గొప్ప రాజకీయవేత్తలు, నాయకులు ఎందరు ఉన్నా... ఒక్కో క్రీడలో ఒక్కో చాంపియన్ ఉంటారని.. వారు తమ ఇంటినుంచే రావాలన్న భావన ప్రతి ఒక్కరిలోనూ ఉండాలి. అప్పుడు ఒలింపిక్స్‌లో బంగారు పతకాలు సాధించడం మనదేశానికి ఏమంత కష్టం కాదు.

హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి రోజైన ఆగస్టు 29న మనం జాతీయ క్రీడా దినోత్సవాన్ని జరుపుకోబోతున్నాం. కనీసం ఆ రోజైనా ప్రభుత్వం, సమాజం క్రీడారంగ ప్రగతికి, క్రీడా సంస్కృతికి కట్టుబడతామని ప్రతిజ్ఞ తీసుకుంటేనే పతకదారిద్ర్యం నుంచి బయటపడగలం. అప్పటి వరకూ భారత క్రీడారంగ పరిస్థితి బేతాళుడు తిరిగి చెట్టెక్కిన కథలానే మిగిలిపోతుంది.

119 సభ్యులతో ఆర్భాటం

పారిస్ గేమ్స్ (1900) నుంచి ఒలింపిక్స్‌లో విడవకుండా పాల్గొంటూ వచ్చిన భారత్. 2016 రియో ఒలింపిక్స్‌లో మాత్రమే అతిపెద్ద బృందంతో 13 రకాల క్రీడాంశాలలో పోటీకి దిగింది. ఒలింపిక్స్ సన్నాహాలలో భాగంగా భారత ప్రభుత్వం టాప్ పథకం కింద మన బృందంలో చోటు సంపాదించిన క్రీడాకారులకు 30 లక్షల రూపాయల చొప్పున ప్రత్యేకసాయం అందించింది. అంతేకాదు రియో ఒలింపిక్స్ ప్రారంభానికి ముందే భారత్ రెండంకెల పతకాలు సాధించడం ఖాయమంటూ ఊదరగొట్టారు. అయితే ఫలితాలు మాత్రం వేరేవిధంగా ఉన్నాయి. లండన్ ఒలింపిక్స్ లో సాధించిన ఆరు పతకాల రికార్డును సైతం భారత ప్రస్తుత బృందం అందుకోలేకపోయింది. ఒలింపిక్స్‌లో వెలవెలబోయిన భారత అథ్లెట్లను ప్రధాని నరేంద్ర మోదీ ట్విట్టర్ ద్వారా సముదాయించినా... క్రీడల సుహృద్భావ రాయబారి సల్మాన్‌ఖాన్ 119మంది సభ్యులకూ లక్షరూపాయల చొప్పున నజరానా ప్రకటించినా వైఫల్యాలు మాత్రం వెక్కిరిస్తున్నాయి.

2012 లండన్ ఒలింపిక్స్ షూటింగ్, కుస్తీ, బాక్సింగ్ విభాగాలలో మాత్రమే పతకాలు సాధించిన భారత్ ఈ సారి మాత్రం బాక్సింగ్, షూటింగ్‌లో స్థాయికి తగ్గట్టుగా రాణించలేకపోయింది. ఒలింపిక్స్ వైఫల్యాలకు వ్యక్తిగతంగా అథ్లెట్లు బాధ్యత తీసుకుంటారో....లేక ప్రభుత్వం, భారత క్రీడాప్రాధికార సంస్థ తీసుకుంటాయో చూడాలి.

వింత లోకం

అపార్ట్‌మెంట్‌లో తోట



సమ్మర్ రేనే పెన్సిల్వేనియా ప్రాంతంలోని ఓ మారుమూల గ్రామం నుంచి న్యూయార్క్ నగరంలో కోటి కలలతో మోడలింగ్ కెరీర్ కోసం వెళ్లింది. కొన్ని రోజులకే ఆమెకు ఏదో వెలితిగా అనిపించింది. సొంతూరులో 5 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఎటు చూసినా పచ్చదనమే. అదే న్యూయార్క్ కాంక్రీట్ జంగిల్‌లో మిస్సయ్యింది. ఇంటి మీద బెంగ కన్నా పచ్చదనం మీద మనాదే ఎక్కువైంది. అంజీరా మొక్కను పడక గదిలో పెట్టాక కానీ మనసు కుదుట పడలేదు. అలా అలా తన అపార్ట్‌మెంట్‌నే చిన్న సైజు తోటలా మార్చేసుకుంది. 1200 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్‌లో 500 పైగా మొక్కల్ని పెంచుతోంది. కొన్నయితే గుబురుగా పెరిగి సీలింగ్‌కు తగులుతున్నాయి. హాల్‌ను రెండుగా విడదీస్తూ దట్టమైన తెరలా లతలు అల్లుకుపోయాయి. 11 ఏళ్ల నుంచి ఎంతో మమకారంగా మొక్కల్ని పెంచుకుంటోంది. రోజుకు 2 గంటల పాటు ఇంట్లో తోట పని ఉంటుందట. ఓషధి మొక్కలు, పూలు, కూరగాయల మొక్కలతో నిండిపోయిన ఆమె అపార్ట్‌మెంట్‌లోకి అడుగు పెడితే అందమైన తోటలో ఉన్న అనుభూతి కలుగుతుందట.

గురుదాస్‌పూర్ ప్రాంతానికి చెందిన 42 ఏళ్ల జర్నైల్ సింగ్ కడుపు నొప్పిగా ఉందని ఆస్పత్రిలో చేరాడు. రకరకాల పరీక్షలు చేసినా నొప్పికి కారణాలు తెలీలేదు. చివరకు అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లో ఏదో ముద్దలా కనిపించే సరికి క్యాన్సర్ వచ్చిందేమో అనుకున్నారు. గాస్ట్రోస్కోపీ చేస్తే గానీ తెలీలేదు... అతడి పొట్టలో కత్తులున్నాయని. అనుకోకుండా కత్తుల్ని మింగావా? అని జర్నైల్‌ను వైద్యులు ఆరా తీస్తే... 'కాదండి వాటిని తినాలనిపించి

కత్తులు తినాలనిపించి

మింగేశా!' అని బిత్తర సమాధానం చెప్పేసరికి నోరెళ్లబెట్టారట. 28 వరకు మింగినట్టు గుర్తుందని ఆయన చెప్పడంతో వెంటనే ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు. 5 గంటలు పాటు జరిగిన శస్త్ర చికిత్సలో 40 కత్తుల్ని బయటకు తీశాక గానీ తెలిసింది జర్నైల్ లెక్క తప్పుగా చెప్పాడని. ప్రాణాపాయం కలిగించే ఈ పని ఎందుకు చేశాడా అని ఆలోచిస్తే అప్పుడు తెలిసింది పీకా అనే రోగం వుందని. బలపం దగ్గర నుంచి ప్లాస్టిక్ వరకు దేన్నీ చూసినా తినాలనిపిస్తుందట రోగులకు. ఇసుక, సబ్బులు, స్పాంజ్‌ల్ని వేటిని వదిలిపెట్టకుండా లాగించేస్తారట. జర్నైల్‌కు అంతకు ముందు కార్ యాక్సిడెంట్ అయ్యింది. అప్పటి నుంచి ఇలా కత్తుల్ని మింగాలనిపిస్తోందట. అంత సర్జరీ అయ్యాక కూడా.

దొంగా పోలీస్

దొంగా పోలీస్ ఆట మనకు బాగా తెలుసు. దాక్కున్న దొంగను వన్ ఐస్.. టూ ఐస్.. అంటూ పట్టుకునే పోలీస్ తిప్పలు మామూలుగా ఉండవు. ఏదో పిల్లలాట అని తీసి పడేయడానికి లేకుండా అంతర్జాతీయ పోటీలు జరుగుతాయి హైడ్ అండ్ సీక్‌కు. 'నాస్ కొండినో' పేరిట ఇటలీలో జరిగే ఈ పోటీలు కూడా అక్కడి సిటీఆర్ఎల్ మేగజీన్ ద్వారా సరదాగానే మొదలైనా ఆ తర్వాత అవి ఏటా పెద్ద ఎత్తున చాలా సీరియస్‌గా సాగిపోతున్నాయి. కాన్సొన్నో అనే నిర్మానుష్య గ్రామంలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో జరిగే ఈ పోటీల్లో 18 ఏళ్లు ఆపైన వ్యక్తులు పాల్గొనాలి. ఐదుగురు జట్టుగా ఆడొచ్చు. ఆటాడే పద్ధతి మనకు కొంచెం భిన్నంగా ఉంటుంది. రగ్బీ క్రీడాకారుల్ని సెర్చ్ టీమ్‌గా పెడతారు. వారికి మస్కా కొట్టి టార్గెట్ మీదకు దూకాలి. ప్రస్తుతానికి ఇటలీ జట్లే ఎక్కువగా ఆడుతున్నాయి. ప్రపంచ నలుమూలల నుంచి బృందాలు రావాలని నిర్వాహకులు కోరుకుంటున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 64 జట్లు ఆడేందుకు ప్రత్యేకమైన దుస్తులు, వస్తువులు ఇతరత్రా ఏర్పాట్లలో ఉన్నాయట.

కేండిల్ లైట్ డిన్నర్‌లు.. డిమ్ లైట్ పార్టీలు.. ప్రత్యేక సందర్భానికో కొంగొత్త విందు, అనుభూతిని రుచి చూపిస్తాయి. మసక వెలుతురుల్లో వంటకాల ఫ్లేవర్ బాగా తగులుతుంది. కళ్లు మూసుకుని మరీ ఆ కమ్మదనాన్ని ఆస్వాదిస్తారు. మరి ఆ కొంచెం కష్టం కూడా ఎందుకనుకుంటే రాయ్‌పూర్‌లోని 'డైలాగ్ ఇన్ ది డార్క్'లో చిమ్మ చీకటి విందారగించాల్సిందే. చీకట్లో భోజనం అక్కడి స్పెషలండోయ్! అంతేకాదు, అక్కడ వడ్డించేవారు మనలాంటి వారుకాదు. పుట్టుకతోనే అంధులు. చీకట్లో భోజనం చేయడ మేంటి? అదీ అంధులు వడ్డించమేంటి? ఇలాంటి అనుమానాలు మీ బుర్రని తినేస్తున్నాయా?! అయితే పదండి, ఆ చీకటి రాజ్యం వెనుక ఉన్న వెలుగుల కథేంటో ఓ లుక్కేద్దాం!!

చిమ్మ చీకట్లో విందు

చత్తీస్‌గడ్ రాజధాని రాయ్‌పూర్‌లోని జిఇ రోడ్‌లోని ఓ మాల్‌లో 'డైలాగ్ ఇన్ ది డార్క్' అనే పేరుతో ఒక రెస్టారెంట్ ఉంది. అంధుల ద్వారా ఈ హోటల్ నడపబడటం ఈ హోటల్ ప్రత్యేకత. ముందుగా రెస్టారెంట్ లోపలికి వెళ్ళేవారికి ఎదురుగా నలుగురు వ్యక్తులు తారసపడతారు. అది అన్ని హోటల్స్‌లోనూ ఉండేదే కదా! అంటూ తీసిపారేయకండి. అక్కడే అసలు కథ మొదలువుతుంది. అలా లోపలకు వెళ్ళగానే అంతా చీకటిగా ఉంటుంది. అక్కడ మనకు ఏమీ కనిపించదు. కానీ ఒక స్వరం మాత్రం వినిపిస్తుందండోయ్! అంటే, కలర్స్ ఛానల్‌లో వచ్చే 'బిగ్‌బాస్' రియాలిటీ షోలోని స్వరంలా అనుకుంటున్నారా! అయితే మీరు కప్పులో కాలేసినట్లే. అది అక్కడ ఉన్న హోటల్‌వారి మాటలు. లోపలకు వచ్చేవారికి ఓ గడియారం ఇస్తారు. దాని ద్వారా ఎదుటి వ్యక్తి చెప్పే సూచనలను వింటూ కస్టమర్లు లోపలికి వెళ్లవలసి ఉంటుంది. అలా సుమారు 45 నిమిషాలపాటు చీకటిలోనే రెస్టారెంట్ లోపల అడవిని దాటుకుని, షేకింగ్ బ్రిడ్జ్ మీదుగా, జలపాతాల సవ్వడులు ఆస్వాదిస్తూ ముందుకు సాగాలి. చీకటిలో మనం వేసే ప్రతి అడుగునూ వారు క్షుణ్ణంగా పరిశీలించి చెప్పినట్లే వారి వాయిస్ వినిపిస్తూ ఉంటుంది. దారిలో షాపింగ్‌మాల్, ప్లేగ్రౌండ్ వంటివి కూడా తారసపడతాయి. అలా వీటన్నింటిని దాటుకుని రెస్టారెంటులోకి అడుగుపెట్టాక, మనకు ఇష్టమైన వాటిని ఆర్డర్ చేసుకోవచ్చు. మనం ఆర్డర్ చేసిన పదార్థాలను తూచా తప్పకుండా మనముందుంచుతారు అక్కడి సర్వర్లు. అన్నట్లు ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి, తిన్నాక బిల్ పే చేయడం కూడా చీకట్లోనేనండోయ్! అలా ఈ చీకటి రాజ్యం నుంచి బయటకురాగానే ఓ ప్రత్యేకమైన అనుభూతి కలుగుతుంది. 45 నిమిషాలపాటు మనల్ని గైడ్ చేసినవాళ్ళు అంధులని మనకు అస్సలు అనిపించదంటే నమ్మండి! మొత్తంమీద హోటల్‌లోని ప్రతి అనుభవం కూడా జీవితంలో మర్చిపోలేని ఓ మధుర క్షణంగా మిగులుతుందనే చెప్పాలి.

రెస్టారెంట్ లోపలికి వెళ్ళేముందు మన దగ్గర ఎటువంటి వస్తువులూ ఉండకూడదు. అంటే, కెమెరాలు, మొబైల్స్, పెన్స్ లాంటివన్న మాట! అలాంటి వాటిని బయటే ఉంచాల్సి ఉంటుంది. వాటికోసం ప్రత్యేకంగా ఓ లాకర్‌ను కూడా ఇస్తారనుకోండి! సుమారు 2000 చదరపు అడుగులు ఉండే ఈ రెస్టారెంట్‌లో కేవలం ఆరుగురు ఉద్యోగులు మాత్రమే ఉంటారు. ఇందులో కేరళ, పశ్చిమబెంగాల్ నుంచి ఒక్కొక్కరు. అలాగే, జార్ఖండ్ నుంచి ఇద్దరు, చత్తీస్‌గడ్ నుంచి ఇద్దరు ఉన్నారు. వీరి పేర్లు జాకీ, ఫైజ్, ఫిలిప్, జుమ్ము, హితేష్ సిన్హా.

నిజానికి ఈ తరహా రెస్టారెంట్ మొదట జర్మనీలో ప్రారంభమైంది. అలా ప్రపంచవ్యాప్తంగా ఇవి విస్తరిస్తూ వస్తున్నాయి. ప్రస్తుతం ఇలాంటి హోటల్స్ మన దేశంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, రాయ్‌పూర్ ఇలా నాలుగు ప్రాంతాలలో ప్రారంభించారు.

ఇక్కడి వారందరికీ ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఈ హోటల్ ద్వారా అయినా అంధులు వారి జీవితాన్ని ఎలా కొనసాగిస్తున్నారో మిగతావారు తెలుసుకోవాలనేది ప్రయత్నం. కంటి చూపు కోల్పోయినా స్పర్శ, జ్ఞానం, వాసన వాటిని ఉపయోగించుకొని కూడా జీవించవచ్చు అని తెలపటమే వీరి లక్ష్యం. తమ జీవితాన్ని ఎలా ఆస్వాదించాలో, ఎలా బతకాలో నేర్పిస్తూ, అంధుల జీవితాలలో వెలుగులు నింపి, వారికి ఉన్న అభద్రతా భావాన్ని దూరం చేయడటమే ముఖ్య ఉద్దేశంగా ముందుకు సాగుతున్నారు.

- అమల తిలారు

చరిత్ర.. రుచి చూడాలని..

షూటింగ్‌ల నుండి విరామం దొరికినప్పుడల్లా సేద తీరేందుకు తారలందరూ రెసార్ట్‌లు, బీచ్‌ల దిశగా ప్రయాణమౌతుంటే అక్షయ్ మాత్రం తీరిక దొరికినప్పుడల్లా భార్య ట్వింకిల్ ఖన్నాతో కలిసి చారిత్రిక విశిష్టత కలిగిన ఫ్రాన్స్ దేశాన్ని చుట్టొచ్చేందుకు ఇష్టపడతాడు. ఫ్రాన్స్‌లోని యాంటిబ్స్, సెయింట్ రెమి ది ప్రావిన్స్ నగరాలు సాంస్కృతిక వారసత్వాన్ని కలిగిన నగరాలు కావడంతో వాటి చరిత్రని తెలుసుకునే పనిలో పడ్డాడు అక్షయ్. మొహంజదారో షూటింగ్‌లో బిజీగా ఉన్న హృతిక్‌కి కొద్దిగా విరామం దొరకడంతో తన చిన్నారులు హ్రిదాన్, హ్రిహాన్‌లతో కలిసి ఫ్రాన్స్ చేరుకున్నాడు. ప్రకృతి అందాలతోపాటు రకరకాల రుచులతో ప్రపంచ యాత్రికుల్ని ఆకర్షిస్తున్న దేశం టర్కీ. టర్కీ వంటకాలని రుచి చూడడంతోపాటు సోదరుడితో కలిసి ఎయిర్ బెలూన్ స్వారీలు చేసేందుకు నటి హుమా ఖురేషీ టర్కీ చేరుకుంటుంది. చైనాలో అతి చిన్న ద్వీపకల్పం మకావ్. ఇక్కడ గ్యాంబ్లింగ్‌ఎంతో పేరుగడించింది. క్యాసినో వెలుగుల్లో మిరిమిట్లు గొలిపే ఈ నగరం మంచి పర్యాటక ప్రాంతం కూడా. ఆషికి-2 స్టార్ శ్రద్ధా కపూర్‌కి నచ్చిన ప్రదేశం కూడా ఇదే. ఖాళీ ఉన్నప్పుడల్లా కుటుంబంతో కలిసి రెండు మూడు నెలలు మకాలో గడిపేస్తుంటుంది. కూతురు శ్రద్ధా, తనయుడు, సిద్ధాంత్ కపూర్‌ల బిజీ షెడ్యూల్స్‌ని కనిపెట్టుకుని ఉండే శక్తి కపూరే అధికంగా టూర్ ప్లాన్ చేస్తుంటారు. శ్రద్ధా కపూర్, టైగర్ ష్రాఫ్‌లు 'భాగీ' షూటింగ్ కోసం మిగతా చిత్ర బృందంతో కలసి కరేబియన్ దీవుల్లో కేరింతలు కొట్టారు. అప్పుడే కరేబియన్ తీరపు అందాలకు దాసోహమైపోయారు. అదే ఫేవరెట్ స్పాట్ అయిపోయింది.

ప్యారిస్ లావ్రే మ్యూజియం దగ్గర పిల్లలతో హృతి



'గ్రేట్ వాల్' మీద ఇలియానా

మాల్దీవుల్లో వాలే ప్రేమ పక్షులు ప్రపంచంలో అతి విలాసవంతమైన ఆతిథ్యం, స్వచ్ఛమైన బీచ్‌లని కలిగుండటంతో మాల్దీవులు బాలీవుడ్ ప్రేమ పక్షులకు విడిది కేంద్రమైంది. రణబీర్ కపూర్, కత్రినా కైఫ్‌ల మనసు దోచుకున్న దేశమిది. వివాహ బంధంతో ఒక్కటైన ప్రేమ జంట సోహా అలీ ఖాన్, కునాల్ కేమూల ఫేవరేట్ ప్రదేశం కూడా ఇదే. ఇక రణ్‌వీర్ సింగ్, దీపిక పదుకోన్‌కు కూడా మాల్దీవుల్లోని తెల్లటి ఇసుక బీచ్‌ల్లో నడవడం మహా ఇష్టం. సోనమ్ కపూర్ తన మిత్రులతో కలిసి న్యూ ఇయర్ వేడుకలకి మాల్దీవుల్ని ఎంచుకుంటే బిపాసా, కరణ్‌సింగ్ గ్రోవర్‌కు మాల్దీవులతో పాటు థాయ్‌లాండ్ చాలా ఇష్టమట. సైఫ్ అలీఖాన్ మాన్సూన్ బ్రేక్ కోసం తన కొడుకు ఇబ్రహీమ్‌తో తరచూ మాల్దీవుల్లో ప్రత్యక్షమవుతాడు. ఇంగ్లాండ్‌లో చదువు పూర్తిచేసుకున్న సైఫ్ స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, అమెరికా, ఓస్లో ఇలా ఎన్ని దేశాలు చుట్టొచ్చినా ఈ దీవులే మనసు దోచుకున్నాయి.

దుబాయ్ అందరికీ..

అత్యంత విలాసవంతమైన జీవనం, ఇసుక దీవులు, వెలుగులు విరజిమ్మే బహుళంతస్తుల రెస్టారెంట్లు, హోటళ్లు దుబాయ్ నైట్‌లైఫ్‌కి ఆనవాలుగా నిలుస్తాయి. అత్యంత ఖరీదైన నగరంగా పేరొందిన దుబాయ్‌లో వినోదానికి కొదవ లేకపోవడంతో కొన్నేళ్లుగా ఎంతో మంది బాలీవుడ్ నటులు ఈ నగరంపై మనసు పారేసుకుంటున్నారు. కొత్త అవకాశాలు లేనప్పుడే కాదు మనసు విశ్రాంతి కోరినప్పుడల్లా తీరిక చేసుకుని మరీ తారలందరూ ఎమిరేట్స్‌లో రెక్కలు కట్టుకు వాలిపోతుంటారు. బాలీవుడ్ బాద్షా షారుక్ కూడా భార్య గౌరి, పిల్లల సరదాగా గడిపేందుకుకు ఎక్కువగా చేరుకునే ప్రదేశం దుబాయ్. ఎమిరేట్స్‌పై మక్కువతో ఓ సొంతింటిని కూడా నిర్మించుకున్నాడు షారుక్. ఈ మధ్య అనిల్ కపూర్ తన బంధువులతో పాటు దాదాపు 400 మంది సినీ మిత్రుల మధ్య తన పుట్టిన రోజు వేడుకని దుబాయ్‌లోని ఎమిరేట్స్ హిల్స్‌లో జరుపుకున్నాడు. మహీప్ కపూర్, జాక్వెలి ఫెర్నాండెజ్, పూనమ్ ధిల్లాన్, రాజత్ రవిల్, మనీ పాల్‌లకి దుబాయ్ నైట్ లైఫ్‌తో పాటు ఎడారి దారుల్లో ఒంటె సవారీలూ తెగనచ్చేసాయి.

పచ్చిక మైదానాలు.. ఐస్ స్కేటింగ్‌లు

లైట్స్.. కెమెరా.. యాక్షన్..... ఈ మూడు

'గోల్డెన్ గేట్ బ్రిడ్జి' వద్ద సోనాక్షి సిన్హా



తారల విహారం

లండన్‌లో నేషనల్ గ్యాలరీ

ఫోకస్ లైట్స్ మధ్య గంటల తరబడి షూటింగ్‌లు, ఎన్నో ప్రదేశాలకి ప్యాకప్‌లు, ఆడియో ఫంక్షన్లు, సినిమా ప్రమోషన్ ఈవెంట్లు ఇలా ఏడాది మొత్తం బిజీ షెడ్యూల్‌తో తలమునకలౌతుంటారు బాలీవుడ్ తారలు. మరి తీరిక సమయాల్లో వీరు ఏం చేస్తుంటారు. షూటింగ్‌లో వివిధ దేశాల్ని చుట్టి రావడమే కాదు ఓ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకోగానే రెండు, మూడు నెలల పాటు వారి విహార లోకంలో సేద తీరేవారు కొందరైతే. స్కూబా డైవింగ్, పర్వతారోహణ వంటి సాహసోపేత యాత్రల బాట పట్టే తారలు మరికొందరు. కొత్త ప్రదేశాల గురించి తెలుసుకోవాలనే అభిరుచితో పురాతన నగరాలన్నీ కలియతిరిగే నటులు ఇంకొందరు. రిఫ్రెష్‌మెంట్ కోసం విదేశాల్లో వాలిపోతున్నారు. ఆ విశేషాలే ఈ వారం మీ కోసం.

కరీబియన్‌లో 'భాగీ' బృందం

పదాలతో విసిగిపోయిన 'షాన్‌దార్' కథానాయిక ఆలియా భట్ మానసిక ఉల్లాసం అందించిన ప్రదేశం ఆస్ట్రియా. ఆస్ట్రియాలోని పచ్చిక మైదానాలు, ఆల్పైన్ సరస్సులు, అందమైన లోయలన్నింటినీ చెల్లెలు షహీన్ భట్‌తో కలిసి వీక్షించింది ఆలియా. సాహస యాత్రలు ఐస్ స్కేటింగ్‌లని ఇష్టపడుతుంటారు ఆమిర్. పచ్చని మైదానాలు, సహజమైన నదులు, ఎత్తైన మంచు పర్వతాలతో ప్రకృతి అందాలకి నిలయమైన స్విట్జర్లాండ్ సోయగాలు పర్యాటకుల్ని కట్టిపడేస్తుంటాయి. ఇక్కడ జరిగే ఐస్ స్కేటింగ్‌కి ప్రపంచవ్యాప్తంగా వేలాదిగా క్రీడాకారులు, సందర్శకులు వస్తుంటారు. యాత్రికులకి ఐస్ స్కేటింగ్ మరో ప్రత్యేక అనభూతినిస్తుంది. అమీర్‌కి ఇష్టమైన ఐస్ స్కేటింగ్‌లో ఇప్పుడిప్పుడే వారసుడు అజాద్ కూడా ఆరితేరుతున్నాడు. మంచుతో కప్పబడిన ఎత్తైన కొండలతో భూతల స్వర్గంగా భావించే స్విట్జర్లాండ్‌లో భార్య కిరణ్ రావ్‌తో కలిసి తన పెళ్లిరోజు వేడుకని జరుపుకున్నాడు ఆమిర్. ఏగెన్ సముద్రంలోని సిక్లేడ్ దీవుల్లో మైకొనాస్ ఎంతో అందమైన ప్రదేశం. డిజె సంగీతం, నృత్యాలతో రోజంతా తెరిచుంచే బీచ్ రిసార్ట్‌లు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. ఏడాది పొడవునా వేలాదిగా సందర్శకులతో కోలాహలంగా ఉండే మైకనోస్ దీవిలో ఉల్లాసంగా గడపడానికి ఇష్టపడుతుంటుంది మలైకా అరోరా. అందుకే ఈ మధ్య తన స్నేహితురాళ్లతో కలిసి గ్రీక్ దీవుల్లో కేరింతలు కొట్టేందుకు మైకనోస్ దీవుల్ని చేరుకుంది మలైకా.

సరిహద్దులు కూడా..

అందమైనా దేశాలే కాదు ఎంతో నైపుణ్యాన్ని జోడించి నిర్మించిన కొన్ని దేశ సరిహద్దు ప్రాంతాలూ టూరిస్టులని ఆకట్టుకుంటున్నాయి. చైనా సరిహద్దు నిర్మాణం 'ది గ్రేట్ వాల్ ఆఫ్ చైనా' వద్ద ప్రయాణం వందలాది మైళ్లు ఆసక్తికరంగా సాగుతుంటుంది. క్రీ.పూ. 220-206 మధ్య చైనీయుల మొట్టమొదటి చక్రవర్తి క్విన్ షి హుయాంగ్ చే చైనా గోడ నిర్మించబడినా మింగ్ వంశస్థుల పరిపాలనలో మరింతగా తీర్చిదిద్దబడింది. ప్రస్తుతం 21,196 కి.మీ విస్తరించి ఉన్న ఈ సరిహద్దు నిర్మాణం ప్రపంచంలోకెల్లా అతి పొడవైన సరిహద్దు గోడగా గుర్తింపు లభించింది. ఇలియానాకు గ్రేట్ వాల్ ఆఫ్ చైనా తెగ నచ్చేసింది. ఇప్పటి వరకు తను చేసిన ప్రయాణాల్లో ఇదో మరుపురాని అనుభూతి అంటూ గ్రేట్ వాల్ వద్ద సెల్ఫీలతో సందడి చేసింది ఇలియానా. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్‌కో నగరాన్ని మెయిన్‌ల్యాండ్‌కు కలిపే గోల్డెన్ గేట్ బ్రిడ్జి ఆ దేశంలో ఓ ప్రత్యేక ఆకర్షణ. సోనాక్షికి ఈ వంతెనపై ప్రయాణం కొత్త అనుభూతినిచ్చిందట. ఆమె వీలు చిక్కినప్పుడల్లా ఆ వంతెన వద్దకు చేరుకుని సూర్యోదయాల్ని చూడాలని అనుకుంటుంది.

-అద్దేపల్లి శర్వాణి

గ్రీక్ ద్వీపం



కవిత్వమ్

వెలుతురు కన్న చీకటి బిడ్డలు

పొట్ట మీద పొయ్యెట్టుకుని తిరుగుతుంటారు
పందిరికి వేలాడే పూలలా
ఒంటి కాలి విన్యాసపు మృత్యు కుహరంలో
ముఖం పెట్టి రెండు కట్టెల మధ్య తీగె ఒకటి కట్టి నడుస్తుంటారు
పట్ట పగటి ఎండ సముద్రం
నిర్దయగా మొహమ్మీద
కుమ్మరించబడుతున్న కిరణ సమూహం
దేన్నీ లెక్క చేయని తీక్షణ ఏకాగ్రత
సాధనను పోగుబెడుతున్న డోలు శబ్దం

కొన్ని విరామాల మధ్య
చిల్లరగా జీవితం చిలకరించబడ్డాక
ఏరుకుంటూ ఉంటారు
ఒకరి చిల్లర ఇంకొకరి అన్నం

ఏ చోటు సొంతం కాని వారికి
నేల నేలంతా నివాసమే
దేహం బంతి ఎక్కడంటే అక్కడికి
దొర్లుకుంటూ పోవడమే

చంకలో పిల్లల ఆకలి కేక
గుండె మీది బండై పరుచుకుని
బతుకు సుత్తి దెబ్బకు ముక్కలౌతూ ఉంటుంది
కడుపులో ఆకలి ఓ ఫీనిక్సు
చస్తుంది కాసేపటికే బతుకుతుంది
డేగ లాగా వెంటపడుతుంటుంది

చావు బతుకుల మధ్య దోబూచులాట
వాళ్ల ధైర్యానికి పరీక్ష పెడుతుంటుంది

నుదుటి మీది శ్రమ బొట్టు మిణుగురులా
వెలుగుతూ ఆరుతూ ఉంటుంది

నెత్తి మీద ప్రమాదాన్ని
జీవితపు కుంపటిలా వెలిగించుకుని
నాలుక కొస మీద జ్వాలలా ప్రాణాన్ని సానబెట్టుతూ
ఒంటిగాను సైకిల్ మీద నిలకడగా కూర్చుండటం
సులువెలా అయ్యిందో

ప్రమాదపుటంచు కొద్ది అడుగుల దూరంలో
మూగిన జనం కాసేపటి చప్పట్ల ఇంధనంతో
నడిచే బతుకు జట్కా బండి
రోడ్డు మీది వినోదం పంచుతూనే ఉంటుంది

ఒకరి పోరాటం ఇంకొకరికి వినోదం
అసమానతలు రాజ్యం చేస్తున్న చోట
జీవితం ఓ అనాగరిక సత్యం

అర్ధరాత్రి మేల్కొలిపే పీడ కల
కంటి మీద వేలాడుతున్నపుడు పెరిగే గుండె దడను
ఓ గుక్క నీళ్లతో చల్లబరుచుకునే నా.
చుట్టూ ప్రమాదం ప్రపంచం కానందుకు
ఎవరికి షుక్రియా చెప్పాలి

ప్రమాదమే ప్రపంచమై బతుకుతున్న
వాళ్లకు ఎన్ని సలాములు అర్పించాలి

- మహమూద్
9441027462

స్టడీ మాల్స్

విద్య అంటే మనిషిలో అంతర్గతంగా దాగి ఉన్న శక్తుల సంపూర్ణ వికాసం. మరి మన దేశంలో విద్యావ్యవస్థ అలా ఉందా? సృజనాత్మకత, వికాసం లాంటి పదాలకు తరగతి గదుల్లో చోటుందా? ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతుల మధ్య చదువుతున్న విద్యార్థులు సైంటిస్టులు, డాక్టర్లు కాగలరా? పట్టణాల్లో ఎంతో కొంత సౌకర్యాలు ఉన్నాయి. మరి పల్లెల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది. అక్కడ చదివే విద్యార్థుల కలలు కల్లలే. ఈ వ్యత్యాసాన్ని చూసి మనసు ద్రవించిన ఓ ఎంబీఏ గ్రాడ్యుయేట్ 'స్టడీ మాల్స్' అనే సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్‌తో విద్యా వ్యవస్థ రూపురేఖల్ని మార్చేందుకు కంకణం కట్టుకున్నాడు.



మహారాష్ట్ర మాండ్వాలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మరాఠీ మీడియంలో ప్రాథమిక విద్యను అభ్యసించాడు సంతోష్ దిగంబర్ రావ్ ఫడ్. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యాపరమైన అసమానతల్ని దగ్గర నుండి చూశాడు. ఇంటర్ చదివేందుకు తాలుకాకు వెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాత ఇంజినీరింగ్ కోసం మహారాష్ట్ర బీడ్‌కు వెళ్లాడు. ఎంబీఏ ముంబైలో పూర్తిచేశాడు. ఇలా పల్లె నుండి పట్టణాలు, నగరాల వరకు అన్ని చోట్లా చదువుకున్నాడు. అప్పుడే గ్రామాలు, పట్టణాల్లోని విద్యావిధానాల్లో తేడాలు తెలిశాయి. ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత ఓ ఫైనాన్స్ కంపెనీలో చేరాడు. ఆ మధ్య ఓసారి మాండ్వాకు వెళ్లాడు. అక్కడ పాఠశాలల్ని చూసి షాకయ్యాడు. గ్రామంలో అతను చదువుకున్న రోజుల్లో స్కూల్ ఎలా ఉందో ఇప్పుడూ అలానే ఉంది. వ్యవస్థలో ఏ మార్పూ కనిపించలేదు. లైబ్రరీ వంటివి కూడా మెరుగుపడలేదు. పట్టణ, గ్రామీణ పాఠశాలల్లో విద్యాప్రమాణాల మధ్య పెరుగుతున్న దూరాన్ని తగ్గించేందుకు 2011లో థింక్ షార్ప్ ఫౌండేషన్ పేరుతో స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాడు సంతోష్. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ఈ విషయాలన్నిటిపై పూర్తి అవగాహన ఉన్న తన మిత్రులు సచిన్ పవార్, దీపాలి బసుర్‌లు చేతులు కలిపారు.

మాల్ అంటే అన్నీ

మాల్ పేరు వినగానే మనకి గుర్తొచ్చేది ఇంటికి కావాల్సిన వస్తువులు, దుస్తులు ఇలా అన్నీ ఒకే చోట దొరికే ఆల్ ఇన్ వన్ అమ్మక ప్రదేశం. మాల్ పదంలోని ఈ సారాంశాన్ని గ్రహించి సంతోష్ గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యవస్థను చక్కదిద్దేందుకు 'స్టడీ మాల్' కాన్సెప్ట్‌ని రూపొందించాడు. అది నచ్చిన మరో ఇద్దరు స్నేహితులు భగ్వాన్ దాస్, శ్రద్ధ భంగెల సహకారంతో 2013లో థింక్ షార్ప్ ఫౌండేషన్ తొలి 'స్టడీ మాల్'ను మహారాష్ట్రలోని సురంగలీలో ప్రారంభించారు. రెండో స్టడీ మాల్‌ను 2015లో జల్గావ్ సమీపంలోని వరంగావ్‌లో, ముంబై సమీపంలోని వంగనిలో మూడో సెంటర్‌ని ప్రారంభించారు. మరో అడుగు ముందుకేసి డిజిటల్ స్టడీ మాల్‌ని కూడా ప్రారంభించారు. థింక్ షార్ప్ ఫౌండేషన్ ఓ స్థలాన్ని అద్దెకు తీసుకుని లేదా ఏదైనా పాఠశాల ఆవరణను ఉపయోగించుకుని స్టడీ మాల్‌ను నిర్వహించేది. మాల్‌లో విద్యతో పాటు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ఉచితంగా అందిస్తారు. స్కూల్ ఆవరణలో ఉండే ఈ మాల్‌లో చదువుకోవచ్చు. ఇక్కడుంచే వస్తువుల్ని వాడుకోవచ్చు. డిజిటల్ క్లాస్ రూమ్‌తో పాటు కళలు, ఎడ్యుకేషనల్ గేమ్స్, ఆట వస్తువులు ఇతర నైపుణ్యాలని అందించే ఎన్నో సాధనాలు ఇక్కడుంటాయి. అటలతో గణితాన్ని నేర్పించడం, ప్రొజెక్టర్ ద్వారా యానిమేషన్ బొమ్మల్ని చూపించడం వంటివి చేస్తుంటారు. స్టడీ మాల్స్‌లో కొందరు పిల్లలు స్వయంగా పద్యాలు, రైమ్స్ నేర్చుకోడానికి ఇష్టపడుతుంటారు. కథలు చెప్పడం, పద్యాలు, కవితలు చెప్పించడం లాంటి యాక్టివిటీస్‌లో పిల్లల్ని నిమగ్నం చేస్తుంటారు వలంటీర్లు. సంతోష్ కుటుంబ సభ్యులు, స్నేహితుల సాయంతో ఔరంగాబాద్‌లోని చికత్‌గావ్‌లో నాలుగో మాల్‌ని ప్రారంభించేందుకు నిధుల్ని సమకూర్చుకుంటున్నాడు.

ప్రభావం చూపించే అంశాలు

ఇప్పటికే మూడు గ్రామాల్లో వెయ్యి మందికి పైగా పిల్లలు స్టడీ మాల్ సేవల్ని ఉపయోగించుకుంటున్నారు. విద్యపై అవగాహన పెంచుకుంటున్నారు. డిజిటల్ లెర్నింగ్ ద్వారా పిల్లల్లో ఏకాగ్రత పెరిగింది. వారి స్టడీ టైమ్ 300 నుంచి 350 శాతానికి పెరిగింది. చదవడం రాయడం 30 నుండి 40 శాతానికి పెరిగింది. స్టడీ మాల్స్‌ని ఉపయోగించుకుని టీచర్లు కూడా కొత్త పద్ధతుల్లో బోధించడంతో విద్యార్థుల్లో హాజరు శాతం కూడా పెరిగింది. కంప్యూటర్‌లో శిక్షణతో పాటు విద్యాపరమైన అభివృద్ధి, వ్యక్తిగత అభివృద్ధి, కెరీర్ అవకాశాలపై అవగాహన పెరుగుతోంది.

కష్టాల ప్రయాణం

ఉద్యోగం చేస్తూ స్టడీ మాల్స్‌ను నిర్వహించడం తలకుమించిన భారమే. సోషల్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ కాస్త కష్టమైన వ్యవహారం. ప్రజల్లో వీటిపై అవగాహన లేకపోవడంతోపాటు ప్రభుత్వ మద్దతు లేకపోవడం పెద్ద సవాల్‌గా మారుతుంది. దీనిపై కోర్సులు అందించే సంస్థలు లేకపోవడంతో అన్నీ సొంతగానే నేర్చుకోవాల్సి ఉంటుంది. స్థిరత్వాన్ని సాధించడం, వనరుల కొరత, నిధుల విషయంలో నియంత్రణ వంటివి ప్రస్తుతం సోషల్ ఆంట్రప్రెన్యూర్లు ఎదుర్కొంటున్న సమస్యలు.

- అనంతోజు మోహనకృష్ణ

స్నేహ హస్తం

గోనుగుంట మురళీకృష్ణ
9701260448

తూర్పున తెలతెలవారుతోంది. వాకింగ్‌కి వెళ్ళే జనం గుంపులు గుంపులుగా, జంటలుగా వేగంగా నడుస్తున్నారు. నాలుగు రోడ్ల కూడలిలో పాలప్యాకెట్లు అమ్మేవాళ్ళు ప్యాకెట్లతో పాటు న్యూస్ పేపర్స్ కూడా అమ్ముతున్నారు. ఆటోలో వెళుతున్న సంయుక్త పాల ప్యాకెట్ల దగ్గర ఆపి, ఒక ప్యాకెట్ తీసుకుంది "పేపర్ కావాలమ్మా!" అని అడిగాడు అమ్ముకునే అతను. "వద్దు" అని డబ్బు అతనికి అందించింది. "పేపర్ చదివేంత ప్రశాంతత ఎక్కడుంది!" అనుకుంది మనసులో.

ఆటో కొద్ది దూరం ప్రయాణించి ఒక ఇంటి ముందు ఆగింది. ఆటోలో ఏడేళ్ళ బాబు, ఐదేళ్ళ పాప ఒకరి మీద ఒకరు మూటల్లాగా పడి నిద్రపోతున్నారు. "పాపా!బాబూ! ఇల్లు వచ్చింది లేవండి" చెయ్యి పట్టుకుని కిందికి దించింది. ఆటో ఛార్జ్ ఇచ్చి పంపేసి ఇద్దరినీ చెరొకవైపు పట్టుకుని బలవంతంగా నడిపిస్తూ మెట్లెక్కి గుమ్మం దగ్గరికి వచ్చింది. తాళం తీసి లోపలికి వస్తూ "త్వరగా రెడీ అవండి. స్కూల్ టైం అవుతుంది" అన్నది.

సంయుక్త లోపలికి వచ్చి బియ్యం కడిగి గ్యాస్ పొయ్యిమీద పెట్టి బాత్రూమ్ లోకి వెళ్ళి బ్రష్ చేసుకుని రెండు చెంబులు నీళ్ళు కుమ్మరించుకుని వచ్చింది. పాలప్యాకెట్ కట్ చేసి పాలు పొయ్యి మీద పెట్టింది. ఇంతలో "అమ్మాయ్!" అంటూ ఇంటావిడ గొంతు ఖంగున వినిపించింది. సంయుక్త గుండె దడదడలాడింది. మెల్లగా ముందు గదిలోకి వచ్చింది.

"మీ ఆయనకి ఎలా ఉంది అమ్మాయ్!" అని అడిగింది ఇంటి ఓనర్.

"అలాగే ఉందండి. ఇంకా ఐ.సి.యు.లోనే ఉంచారు" మెల్లగా సమాధానం చెప్పింది సంయుక్త.

"ఎందుకైనా మంచిది. మరో ఇల్లు వెతుక్కోమ్మా! జరగరానిది ఏమైనా జరిగితే అవన్నీ ఇక్కడ కుదరదు" దీర్ఘం తీస్తూ వెళ్ళిపోయింది.

సంయుక్త నిట్టూర్చింది. ఇంతక్రితం రెండుసార్లు ఇల్లు ఖాళీ చేయమన్నట్లుగా మాట్లాడింది ఓనర్. సంయుక్తకి ఆఫీసులో వర్క్ ఎక్కువగా ఉంది. పిల్లల్ని స్కూల్‌కి పంపించాలి. వచ్చేటప్పుడు తీసుకురావాలి. హాస్పటల్‌లో భర్తను చూసుకోవాలి. క్షణం తీరిక ఉండటం లేదు. ఇంకా ఇల్లు వెతుక్కునే సమయం ఎక్కడుంది? మేనేజర్ శెలవు ఇవ్వటానికి ఒక పట్టాన ఒప్పుకోడు. అతణ్ణి శెలవు కోసం అడగాలంటే గొంతులో ఏదో అడ్డు పడ్డట్టు ఉంటుంది సంయుక్తకి. అతని తీక్షణమైన చూపులు పని తప్పించుకోవటానికి ఇదొక వంకా! అన్నట్లు చూస్తాడు. తను వివరంగా చెప్పబోతే వినిపించుకోడు.

సంయుక్త భర్తకి ఎలాంటి దురలవాట్లు లేవు. కానీ డయాబెటిస్ ఉంది. కిడ్నీలు రెండు చెడిపోయాయి. హాస్పటల్‌లో చేర్పించింది. కిడ్నీలు పని చేయకపోవటం వలన గుండెకు మంచి రక్తం అందటం లేదని ఐ.సి.యులో ఉంచారు. చెల్లెలు రాణిని కొద్ది రోజులు తోడు ఉండటానికి రమ్మని పిలిచింది. ఆమెకు పిల్లలులేరు. భార్య భర్తలు ఇద్దరే! ఇంట్లో పనికి పనివాళ్ళు ఉంటారు.

బోలెడంత తీరుబడి.

"అన్నీ నర్సులే చూసుకుంటారు. నేనే ఆఫీసుకి వెళ్ళాలి. ఇక్కడ ఎవరో ఒకరు బాధ్యతగా ఉండాలి కదా! ఊరికే తోడు ఉంటే చాలు" అన్నది సంయుక్త చెల్లెలితో. చెల్లెలు అతి కష్టంమీద ఒకరోజు ఉంది. "కింద పడుకోవటం నాకు అలవాటు లేదక్కా! చీమలు కుడుతున్నాయి. ఇంటి దగ్గర హాయిగా ఏ.సి. రూంలో పడుకోవటం అలవాటు" అన్నది.

"పోనీ నేనే ఇక్కడ ఉంటాను. నువ్వు పిల్లల్ని చూసుకోవే!" అన్నది సంయుక్త. "ఈ చాకిరీ నా వల్ల కాదు. అయినా మా ఆయన నా కోసం బెంగ పెట్టుకుంటారు. నేను వెళ్ళాలి." అని సంయుక్త బ్రతిమిలాడుతున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయింది రాణి.

సంయుక్త జరిగిపోయినవన్నీ ఆలోచిస్తూనే చకచకా పనిచేస్తోంది. స్కూల్ బస్ వచ్చింది. పిల్లల్ని బస్ ఎక్కించి తను లంచ్ బాక్స్ సర్దుకుని ఆదరాబాదరాగా ఆఫీస్‌కి వెళ్లేసరికి పదింబావు అయింది. మేనేజర్ తన ఛాంబర్ లో నుంచే డేగ కళ్ళతో తీక్షణంగా చూస్తున్నాడు. అదేమీ గమనించనట్లు నటిస్తూ సంయుక్త కంప్యూటర్ ఓపెన్ చేసింది. ఆఫీస్‌కి వస్తే ఇదొక లోకం. పనిలో పడితే సమయం ఎంత అయిందో తెలియదు.

సాయంత్రం అయింది. సంయుక్త మేనేజర్ ఛాంబర్‌లోకి వెళ్ళింది. సంయుక్త ఎదురు సీటు అతనితో మాట్లాడుతున్న మేనేజర్ మాటలు ఆపి. ఏమిటన్నట్లుగా చూశాడు. "రేపు నాకు శెలవు కావాలి సర్!" అన్నది భయం భయంగా వాళ్ళ సంభాషణకు అంతరాయం కలగటంతో సంయుక్త ఎదురు సీటులో ఉండే అతను కళ్ళజోడుపై నుంచీ ఆమె వైపే చూడసాగాడు. అతని పేరు మధుబాబు.

"చూడండి సంయుక్త గారూ! ఈ నెలలో ఇప్పటికే నాలుగు రోజులు శెలవు పెట్టారు. నెలకు ఒక్కరోజు కన్నా ఎక్కువ ఇవ్వటానికి రూల్స్ ఒప్పుకోవు." అన్నాడు మేనేజరు.

"ప్లీజ్ సార్! మా ఆయనకు హెల్త్ బాగాలేదు. ఐ.సి.యులో ఉంచారు." భర్త గుర్తుకు రాగానే సంయుక్త గొంతు గద్గదమయింది.

"పోనీ! ఏదైనా వర్క్ ఉంటే నేను చేస్తాలెండి. పాపం చాలా అవసరం అంటున్నారు కదా సంయుక్తగారు" అన్నాడు మధుబాబు.

ఓ.కే. ఈ ఒక్కరోజు పర్మిషన్ ఇస్తున్నాను" అన్నాడు మేనేజరు.

సంయుక్త మధుబాబు వంక కృతజ్ఞతగా చూసి బయటకు నడిచింది. ఈ మధుబాబుతో తను ఎక్కువగ మాట్లాడదు. అతను కూడా గంభీరంగా ఉంటూ తన పని తాను చేసుకుంటూ పోతాడు. తప్పు అనవసరంగా ఎవరి విషయాల్లో జోక్యం చేసుకోడు. ఆఫీస్‌లో కొలీగ్స్ చాలామంది ఎదురుగా మంచిగా మాట్లాడుతూ వెనక ఏవో కొంటె కూతలు కూస్తూ ఉంటారు. మధుబాబు ఎప్పుడూ అలా ప్రవర్తించలేదు. హుందాగా ఉంటాడు.

ఆలోచిస్తూనే సంయుక్త హాస్పటల్ కి వచ్చి ఐ.సి.యు దగ్గరికి వచ్చింది. అక్కడ ఎవరూ లేరు. ఖాళీగా కనిపించింది. అటు వెళ్తున్న నర్స్‌ని ఆపి "సిస్టర్! మా వారు ఏరీ! అని అడిగింది.నా డ్యూటీ అయిపోయింది. డాక్టర్ గారిని అడగండి" అన్నది నర్స్. సంయుక్త కిందికి దిగివచ్చి డాక్టర్ రూంకి వెళ్ళి. "డాక్టర్ గారూ! మా ఆయన కనిపించలేదు. ఐ.సి.యు నుంచీ రూంలోకి షిఫ్ట్ చేశారా? అని

" మా ఇంట్లో ఒక పోర్షన్ ఖాళీగా ఉంది. మీరు అక్కడ ఉందురుగాని రండి" అని మధుబాబు అన్నాడు.
"నేను... మీరు...నా పరిస్థితి" తడబడుతూ అన్నది సంయుక్త.
"నాకు తెలుసు. నాకు అలాంటి అర్థం పర్థం లేని ఆచారాలు లేవు రండి" అన్నాడు.

అడిగింది గాబరాగా.

డాక్టర్ బజర్ నొక్కి మరో నర్స్‌ని పిలిచి సంయుక్తని చూపించాడు. "నాతో రండి" నర్స్ సంయుక్తని పిలిచి ముందుకు దారి తీసింది. రెండు వార్డులు దాటి వచ్చారు. "భర్త ఎక్కడున్నాడో చెప్పకుండా ఎక్కడికి తీసుకువెళుతుంది?" అర్థం కాక మనసులోనే అనుకుంది సంయుక్త. కొద్ది దూరం వెళ్ళిన తర్వాత నర్స్ ఒక గది దగ్గర ఆగింది. ఆ గది ముందు మార్చురీ అనే బోర్డు చూడగానే గుండె ఝల్లుమంది. సంయుక్త కళ్ళు పెద్దవి అయ్యాయి. "ఇదేమిటి? నాకు.....నాకు... చెప్పలేదే! వణికే కంఠంతో అన్నది. నర్స్ గభాలున ఆమె భుజం చుట్టూ చెయ్యి వేసి "ఇలా రామ్మా!" అంటూ బయటికి తీసుకువచ్చి, కొద్ది దూరంలో వరండాలో బల్లమీద కూర్చోబెట్టింది. సంయుక్త కడుపులో నుంచి దుఃఖం సుడులు తిరిగి గొంతులోకి పాకింది. మరుక్షణం గుండెలు బద్దలయ్యేట్లు ఏడవసాగింది. నర్స్ ఆమె వంక జాలిగా చూస్తూ నిలబడిపోయింది.

◆◆◆

మర్నాడు సాయంత్రం బస్టాండులో కుర్చీలలో కూర్చున్నారు సంయుక్త భర్త తమ్ముడు వినోద్. ఆమె చెల్లెలు రాణి. "మా చంటాడికి జ్వరం ఉన్నది వదినా! అన్నయ పోయాడని తెలియగానే ఉన్న పళాన పరుగుత్తుకు వచ్చేశాను. అక్కడ నా భార్య ఒక్కతే ఏం అవస్థలు పడుతున్నదో ఏమిటో? అన్నాడు వినోద్.

సంయుక్త సర్వం పోగొట్టుకున్నట్లు కూర్చుని ఉంది. పిల్లలు కూడా ఆమెను అంటిపెట్టుకుని దిగాలుగా ఉన్నారు. "బావగారు పోయి రెండు రోజులైనా కాలేదు. పది రోజుల వరకూ మైల ఉంటుంది. ఈ స్థితిలో నిన్ను నాతో ఎలా తీసుకువెళ్ళను అక్కా! మా అత్తగారి సంగతి నీకు తెలియనిది ఏముంది? ఆమెకు మడి, ఆచారాలు ఎక్కువ.నిన్ను తీసుకువెళితే నన్ను కూడా లోనికి రానివ్వదు" అన్నది రాణి.

"ఆరు నెలల తర్వాతయినా పుట్టింట్లో నిద్ర చేసేదాక బంధువుల ఇళ్ళకి వెళ్ళకూడదు." అన్నాడు వినోద్.

"అదిగో ! బస్ వచ్చింది, నేను వెళతాను వదినా!" సమాధానం కోసం ఎదురు చూడకుండా గభాలున పరుగెత్తి బస్ ఎక్కేశాడు వినోద్.

"కట్టు బట్టలతో, ఇద్దరు పసి పిల్లలతో నేను ఎక్కడకు వెళతాను రాణీ!" కన్నీళ్ళతో అన్నది సంయుక్త.

"ఏం చేస్తాం! దిక్కులేని వాళ్ళకు దేవుడే దిక్కు" ఓదార్పు చెప్పి వెళ్ళిపోయింది రాణి.

సంయుక్త మనసు నిండా భయంకరమైన ఒంటరితనం కారు చీకటిలా కమ్ముకుంది. తనని అందరూ వదిలేశారు. ఎవరూ రానివ్వటం లేదు. ఆరోజు భర్త పోగానే బాబాయిలకు, మేనత్తకు భర్త తరపు బంధువులకు ఫోన్లు చేసింది సంయుక్త. అందరూ పుష్కలంగా సానుభూతి చూపించారు తప్ప ఎవరూ రాలేదు. కొంత మంది ఫోన్‌రింగవగానే కట్ చేశారు. వినోద్, రాణి దగ్గరి బంధువులు కాబట్టి రాకపోతే బాగుండదు అన్నట్టు వచ్చారు. వచ్చిన దగ్గర నుంచీ అతను చిరాకు అణచిపెట్టుకున్నట్లు అసహనంగా ఉన్నాడు. రాణి ముభావంగా కూర్చుని ఉంది.

భర్త శవాన్ని తీసుకుని ఇంటికి వస్తే ఓనర్ గేటు దగ్గరే అటకాయించింది. "అమ్మాయ్! నీకు వారం ముందే చెప్పాను. మరో ఇల్లు చూసుకోమని. అద్దె ఇంట్లో ఇవన్నీ చేస్తే అరిష్టం. వెళ్ళిపో!" అన్నది నిక్కచ్చిగా. గేటు మూసి తాళం పెట్టి ముఖం మీదే తలుపేసుకుంది.

"శాస్త్రోక్తంగా అంత్యక్రియలన్నీ చేయాలంటే కుదరదు వదినా! ఎలాగోలా అయిందనిపించటమే! ఎలక్ట్రిక్ క్రిమేషన్ చేద్దాం." అన్నాడు వినోద్. సంయుక్త మౌనంగా తలూపింది. అంతకన్నా చేయగలిగింది ఏముంది? ఎలక్ట్రిక్ క్రిమేషన్ అనగానే డైరెక్ట్‌గా బస్టాండుకు వచ్చారు. సంయుక్త స్నానం చేయలేదు. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. "అమ్మా! అమ్మా!" ఆలోచనలో మునిగిపోయిన తల్లిని పట్టుకుని ఊపుతూ అన్నది పాప. సంయుక్త ఈ లోకంలోకి వచ్చి, ఏమిటన్నట్లు చూసింది. "ఇంటికి వెళదాం అమ్మా!" అన్నది పాప. సంయుక్త

భారమైన మనసుతో లేచింది. భర్త పోయిన దిగులుకన్నా. ఇప్పుడెక్కడ ఉండాలి? అనే దిగులే వేధిస్తుంది. భర్త సొంత ఇల్లు ఏర్పాటు చేసుకోవాలని ఎప్పుడూ అంటుండేవాడు. "ఇప్పుడు ఇంట్లో లేక వీధిలో ఉన్నామా' అని తీసిపారేసేది తను. సొంత ఇంటి విలువేమిటో ఇప్పుడు తెలుస్తుంది. సొంత ఇల్లు ఉంటే తిన్నా తినకపోయిన ఒక మూల పడి ఉండవచ్చు. స్వంత ఇల్లు లేని జీవితం ఇంత దుర్భరం అని తెలియదు.

సంయుక్త హోటల్ రూం తీసుకుంది. నాలుగు రోజులు ఇక్కడుంటే తర్వాత సంగతి ఆలోచించుకోవచ్చు ఆ రోజు ఓనర్ ఇంట్లోకి రానివ్వలేదు. కనీసం బీరువాలోని డబ్బు కూడా తీసుకునే అవకాశం ఇవ్వలేదు. అదృష్టవశాత్తు తను ఏ.టి.యం కార్డు హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకుంది. ఇంకా నయం! ఈ పరిస్థితిలో డబ్బు కూడా లేకపోతే ఎలా!

ఆ మర్నాడు సంయుక్త ఆఫీస్‌కి వచ్చింది. శెలవు పెట్టుకోవడానికి అడగవచ్చు. శెలవు పెట్టి ఆ హోటల్‌లో ఒంటరిగా ఉండలేదు. ఇక్కడే అయితే సాయంత్రం వరకూ ఎలాగోలా గడిచిపోతుంది అనుకుంది. మధుబాబు వర్క్ చేసుకుంటూనే మధ్య మధ్య కళ్ళెత్తి ఎదురు సీటు వంక చూస్తున్నారు. సంయుక్త ఆలోచిస్తూ స్తబ్దుగా కూర్చుండిపోవటం నీళ్ళు నిండిన కళ్ళతో దిగులుగా ఉండటం అన్నీ గమనిస్తూనే ఉన్నాడు. సాయంత్రం అయింది. అందరూ ఇళ్ళకి బయలుదేరుతున్నారు. మధుబాబు సంయుక్త దగ్గరకు వచ్చి "సంయుక్త గారూ! ఇప్పుడెక్కడ ఉంటున్నారు?" అని అడిగాడు.

"హోటల్ రూంలో"

" మా ఇంట్లో ఒక పోర్షన్ ఖాళీగా ఉంది. మీరు అక్కడ ఉందురుగాని రండి" అన్నాడు.

"నేను... మీరు...నా పరిస్థితి" తడబడుతూ అన్నది.

"నాకు తెలుసు. నాకు అలాంటి అర్థం పర్థం లేని ఆచారాలు లేవు రండి" అన్నాడు.

మధుబాబు ఒక ట్యాక్సీ మాట్లాడాడు. దారిలో స్కూల్ దగ్గర ఆపి పిల్లల్ని తీసుకుని. ముగ్గురితో ఇంటికి వచ్చాడు. మధుబాబు భార్య వచ్చి తలుపు తీసింది. "శాంతి! ఈమె సంయుక్త అని మా ఆఫీస్‌లో పనిచేస్తుంది. నిన్న చెప్పానే....." అన్నాడు. శాంతి చిరునవ్వుతో సంయుక్త చెయ్యి పట్టుకుని "లోపలికి రండి". అన్నది. సంయుక్త తుళ్లి పడింది. పది రోజుల దాకా మైలు అని తనని ఎవరూ తాకటం లేదు. ఈమె నిస్సంకోచంగా పట్టుకుంది. శాంతి అదేమి పట్టించుకోలేదు. సోఫాలో కూర్చోమని చెప్పి, లోపలికి వెళ్ళి ఐదు నిమిషాల తర్వాత కాఫీ కప్పులతో తిరిగి వచ్చింది.

ఒకటి ఆమెకిచ్చి మరొకటి తను తీసుకుని ఎదురుగా కూర్చుంది.

కొద్దిసేపు మాట్లాడి "స్నానం చేసి రండి. భోజనం చేద్దురు గాని ఎప్పుడు తిన్నారో, ఏమిటో!" అన్నది. సంయుక్త స్నానం చేసి పిల్లలకి కూడా చేయించింది. శాంతి తన చీర కట్టుకోమని ఇచ్చింది. ముగ్గురికీ వేడి వేడిగా పొగలు కక్కుతున్న అన్నం వడ్డించింది. మామిడి కాయ పప్పు, గోంగూర పచ్చడి, సాంబారు, గడ్డ పెరుగు వడ్డించింది. భోజనం చేస్తున్నప్పుడు కానీ తను ఎంత ఆకలితో ఉన్నదో తెలియలేదు. సంయుక్తకి కడుపు నిండిన తర్వాత స్థిమితం చిక్కినట్లు అనిపించింది.

డైనింగ్ టేబుల్ క్లీన్ చేస్తున్న శాంతిని చూసి "మధు బాబు గారు ఏరీ! ఎక్కడకు వెళ్ళారు?" అని అడిగింది. సంయుక్త. " మీ సామాను అంతా తీసుకురావటానికి పనివాళ్ళను వెంటబెట్టుకుని మీ ఇంటికి వెళ్ళారు." అన్నది శాంతి. సంయుక్త విస్మయంగా చూసింది. అవును ట్యాక్సీలో ఉన్నప్పుడు ఇంటి తాళం చెవి అడిగాడు. తను పరధ్యానంగానే ఇచ్చింది.

గంట తర్వాత సామాను లారీ ఇంటి ముందు ఆగింది. పనివాళ్ళు చకచకా పక్క పోర్షన్‌లో సర్ది వెళ్ళిపోయారు.

సంయుక్తకి అప్పటి దాకా గుండెల మీద ఉన్న కొండంత బరువేదో దిగిపోయినట్లు అనిపించింది. మనసంతా ఆవరించిన దిగులు పొగమంచులా కరిగిపోయినట్లు తేలిక అయింది.

" మధు బాబూ! ఈ రోజు మీరు చేసిన సాయం జన్మలో మర్చిపోలేను. మీ రుణం తీర్చుకోలేను. దేవుడే మీ రూపంలో వచ్చి ఆదుకున్నాడేమో అనిపిస్తుంది. మనస్ఫూర్తిగా అన్నది సంయుక్త.

"నేనే దేవుడిని కాను. మనిషిని మామూలు మనిషిని. ఇంకా చెప్పాలంటే మీ స్నేహితుడిని. మామూలు రోజుల్లో స్నేహం నటిస్తూ కష్టాల్లో ఉన్నప్పుడు మొహం చాటేసే వారు స్నేహితులనిపించుకోరు. ఆపదలో ఆదుకున్న వాడే నిజమైన స్నేహితుడు. నాకు మీ స్నేహ హస్తం అందిస్తే చాలు" అన్నాడు మధుబాబు చిరునవ్వుతో.

"తప్పకుండా! మీరిద్దరూ నూరేళ్ళు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నాను" అన్నది.

"అదిగో! దీవించారుగా! మీ రుణం తీరిపోయింది" నవ్వుతూ అన్నది శాంతి. సంయుక్త కూడా అప్రయత్నంగా నవ్వింది. కష్టాల కడలిని దాటి, సుఖాల తీరం చేరుకున్నట్లు సంయుక్త మనసంతా నిశ్చితంగా, అనిర్వచనీయమైన ఆనందంగా అనిపించసాగింది. ✦

తెలుసా

కొబ్బరి తీరం

Coconut Day



దక్షిణ పసిఫిక్‌లోని న్యూ గినియా ప్రాంతంలో తొలిసారి కొబ్బరి జాతి వ్యాప్తి చెందిందని శాస్త్రవేత్తల భావన. కొబ్బరిలో 1300 రకాలున్నాయి. వాటిని రెండు జన్యు జాతుల కింద గుర్తించారు. పసిఫిక్, హిందూ మహా సముద్ర జాతులే అవి.

✧ కొబ్బరి విత్తు జంతువుల విసర్జకాల ద్వారా వ్యాప్తి చెందలేదు. కొబ్బరి కాయ సముద్రపు నీటిలో మునగకుండా ప్రత్యేక ఆకృతిలోకి పరిణామం చెందింది. అలలపై తేలుతూ సమీప తీరాలకు చేరి అక్కడ మొలకెత్తి అలా మిగతా ప్రపంచానికి విస్తరించిందని వాదన. 110 రోజులపాటు 3 వేల మైళ్లు సముద్రంలో కొట్టుకుపోయినా కూడా అవి మొలకెత్తగలవట.

✧ కొబ్బరి నూనెతో వాహనాలు నడిపే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పలు పరిశోధనలు చెబుతున్నాయి. పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయ ఇంధనంగా ప్రత్యేక కొబ్బరి నూనె కోసం ప్రయోగాలు ఊపందుకున్నాయి.



✧ అణు ధార్మికత ప్రాంతాల్ని శుద్ధి చేసేటపుడు కొబ్బరి మట్టు (చార్‌కోల్)ను కూడా ఉపయోగిస్తారు. ప్రమాదానికి గురైన ఫుకుషిమా అణు విద్యుత్ ప్లాంట్‌ను శుద్ధి చేసేటపుడు దీన్ని వాడారు. మొదటి ప్రపంచ యుద్ధంలో గ్యాస్ మాస్క్‌ల్లో ఉపయోగించడం ద్వారా కొబ్బరి చార్‌కోల్ ప్రయోజనం ఎక్కువగా ప్రచారంలోకి వచ్చింది.

✧ మాల్దీవుల జాతీయ వృక్షం కొబ్బరి చెట్టు. దాని సైనిక దళాల దుస్తులపై కొబ్బరి చెట్టు గుర్తు ఉంటుంది. కరెన్సీ నోట్లపై కూడా కనిపిస్తుంది.

✧ తీర ప్రాంతాల్లోని సంస్కృతి కొబ్బరితో బాగా ముడిపడిపోయింది. మన కోనసీమ నుంచి కేరళ మలబారు తీరం వరకు కొబ్బరిది ప్రత్యేక స్థానం. ఫిలిప్పైన్స్‌లోని మాగ్లాలాతిక్ తెగ వారికైతే కొబ్బరితో ప్రత్యేక ప్రదర్శనలు, నృత్యాలున్నాయి.

✧ కొబ్బరి నార, పీచుతో దృఢమైన రక్షక దుస్తుల్ని (ఆర్మర్) అల్లుతారు మైక్రోనేషియాలోని కిరిబాతీ తెగలు. తల నుంచి పాదాల వరకు రక్షణనిచ్చే ఈ దుస్తులు రాళ్ల దాడిని కూడా అడ్డుకోగలవు.

✧ కొబ్బరి పూవును డిస్టిల్ చేయడం ద్వారా లాంబానోగ్ అనే సారాయి తయారు చేస్తారు ఆగ్నేయాసియా వాసులు. ఇంటి వంటకంగా మొదలైన ఈ సారా తయారీ పెద్ద ఎత్తున మార్కెట్‌ను తాకుతోందిపుడు. మ్యాంగో, బబుల్‌గమ్, బ్లూ బెర్రీ అనే ఫ్లేవర్లతో కొబ్బరి సారా దొరుకుతుందక్కడ.



✧ కొబ్బరి నూనెలోని ట్రైగ్లిజరైడ్‌లు త్వరగా జీర్ణమవుతాయి. అంతే కాదు చాలా శక్తిని కూడా ఇస్తాయి. జీవక్రియలపై మంచి ప్రభావాన్ని చూపుతాయి.

✧ కొబ్బరి నూనెలో నాలుగు గ్రోత్ హార్మోన్‌లు కూడా ఉంటాయి. అవి ఎన్నో జీవ వ్యవస్థల అభివృద్ధికి కీలకం.

✧ 3.7–5.5 కోట్ల ఏళ్ల నాటి కొబ్బరి శిలాజాలు భారత్‌లోను, ఆస్ట్రేలియాలోను దొరికాయి.

✧ కొబ్బరి నీరులో ఖనిజాలు, లవణాలు, జీవ ప్రేరక ఎంజైమ్‌లు అధికంగా ఉంటాయి.

✧ టిష్యూ కల్చర్ శాస్త్ర ప్రపంచాన్ని మలుపు తిప్పింది కొబ్బరి నీరే. వాటిపై ప్రయోగాలు ఎన్నో కొత్త పోకడలకు దారి తీసింది.

✧ కొబ్బరి చెట్టెక్కి కాయల్ని దింపడం తేలిక కాదు. అందుకే మలేషియా, థాయ్‌ల్యాండ్, సుమత్రా దేశాల్లో రైతులు కోతులకు ప్రత్యేక శిక్షణనిచ్చి వాటితో కాయల్ని కోయిస్తారు. యజమాని మాటల ద్వారా వేటిని తెంచాలో వేటిని వదిలేయాలో వాటికి బాగా తెలుసు.

✧ కొబ్బరి సాగు సుమారు 80 దేశాల్లో ఉంది. అత్యధికంగా పంట ఉన్న దేశాల తొలి స్థానాలు ఫిలిప్పైన్స్, ఇండోనేషియా, భారత్‌లవి.

✧ అత్యవసర సమయాల్లో ప్రత్యామ్నాయం లేనపుడు కొబ్బరి నీటిని ఐవీ సెలైన్‌లా వాడిన సందర్భాలు అనేక యుద్ధాల్లో వెలుగు చూశాయి. ఎందుకంటే కొబ్బరి నీరు రక్తంలోని ప్లాస్మాకు దగ్గరగా ఉంటుంది.

✧ కొబ్బరిలో ప్రొటీన్ ఎక్కువగాను, కొబ్బరి పాలలో చక్కెర శాతం తక్కువగాను ఉంటుంది.



✧ ఫిలిప్పైన్స్ అధ్యక్షుడు ఫ్రెడినాండ్ మార్కోస్‌కు కొబ్బరి చెట్లంటే పిచ్చి అందుకే కేవలం కొబ్బరి భాగాలతోనే ప్యాలెస్ కట్టించుకున్నాడు. కోకోనట్ ప్యాలెస్‌కు 60 కోట్ల రూపాయలకు పైగానే ఖర్చయ్యింది. అలంకరణకు కూడా కొబ్బరే.

✧ తీర ప్రాంతాల్లో సొర చేపల దాడి వల్ల కంటే ఎక్కువ మంది కొబ్బరి కాయ నెత్తిమీద పడి చనిపోయిన వారేనని ఓ లెక్క. ఏటా 150 మంది ఇలా చనిపోతున్నారట.

(సెప్టెంబర్ 2 ప్రపంచ కొబ్బరికాయ దినోత్సవం సందర్భంగా)

కొత్త పుస్తకాలు

బాలలకు బంగారు కానుక

కరుణశ్రీ 'జంధ్యాల పాపయ్య శాస్త్రి' గురించి తెలియనివారుండరు. కవిగా పండితునిగా, విమర్శకునిగా, వ్యాఖ్యాతగా, సంపాదకుడిగా, బాల సాహిత్య కథకుడిగా, ఉపన్యాసకుడిగా బహువిధ ప్రతిభామూర్తి అయిన కరుణశ్రీ బాలలకు ఇచ్చిన బంగారు కానుక బాలసాహితి-2.

అమరగాయకుడు ఘంటసాల కంఠం నుండి జాలువారిన "పుష్పవిలాపం" కరుణశ్రీ కలం నుండి వెలువడినదే. వారి సాహిత్యాన్ని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపుటాలుగా పునర్ముద్రిస్తున్నది. అందులో భాగంగా కరుణశ్రీ సాహిత్యం-4 మనకు ముఖ్యంగా పిల్లల కోసం అందుబాటులోకి వచ్చిన బాల సాహిత్యమిది. 646 పేజీల ఈ పుస్తకంలో అనేక కథలున్నాయి. నవలలు, నాటికలు, పద్యాలు, పిల్లలను ఉద్దేశించి రాసినవి. బాలబాలికల్లో పఠనాసక్తిని పెంపొందించడం, మనోవికాసం కలిగించడం, నీతి, నియమం, భక్తి, రక్తి, ఆసక్తి, ఆకాంక్ష కలిగించడం ఈ రచన ఉద్దేశం. భారత దేశంలో విస్తారంగా ప్రచారంలో ఉన్న పురాణాల నుండి చరిత్రలోని ప్రముఖ వ్యక్తుల వరకూ వారి జీవితాల్లోని ముఖ్యాంశాలను పిల్లలు చదువుకునేందుకు వీలుగా అక్షర బద్ధం చేశారు కరుణశ్రీ జంధ్యాల పాపయ శాస్త్రి గారు. భావితరాలను తీర్చిదిద్దటంలో ఇటువంటి రచనలు ఎంతో తోడ్పడతాయి. ఒక్క పిల్లలే కాకుండా, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు చదివి పిల్లలకు చెప్పాల్సిన అవసరమెంతో ఉంది. తెలుగు తల్లి మెడలో పూలమాలికలు బంగారు భవిష్యత్‌కు ఏలికలు అయిన చిన్నారి బాలబాలికలు తప్పక చదవాల్సిన పుస్తకం ఇది.

కరుణశ్రీ సాహిత్యం-4
బాలసాహితి-2
రచయిత: జంధ్యాల పాపయ శాస్త్రి
పేజీలు: 646
వెల: 390/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

- భవిష్య

గాయపరిచిన అక్షరాలు

'శోకస్య మాపద్య యస్య శ్లోక:' శోకం నుంచి శ్లోకం పుట్టిందని అన్నారు. ఆ వేదనాగ్నిలో పుటం పెట్టిన అక్షరాలే కవిత్వం. అవమానాలకి, అన్యాయాలకి చలించిన వాడే కవి. గుండెకు సూటిగా ఎక్కుపెట్టిన కవితలే ఇవి. 21వ శతాబ్దంలో కూడా స్త్రీలు రెండో తరగతి పౌరులే. ఈనాటికీ ఆరేళ్ల పాపాయి నుంచి ఆరు పదుల వృద్ధుల వరకు అత్యాచారాలకు గురికాబడుతూనే ఉన్నారు. వరకట్నాల హత్యలు, పరువు హత్యలు ఇంకా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. స్త్రీలు ముఖ్యమంత్రులుగా పాలిస్తున్న ఈ రోజుల్లో కూడా ఆడపిల్లల భ్రూణ హత్యలకు అంతం లేకుండా పోతోంది. పురుషాధిక్య సమాజాన్ని నిరసిస్తూ కవయిత్రి ఎన్నో ప్రశ్నలను సంధించారు. అర్థంలేని సంప్రదాయాలను ధిక్కరించారు. 'నిన్న నిర్భయ.. నేడు అభయ.. ఈ భయాలు ఎన్నాళ్లు.. అని ప్రశ్నిస్తారు.. 'ఇలా ఇంకెన్నాళ్లు' అనే కవితలో. 'స్త్రీలను దేవతలంటూ దయా స్వరూపులంటూ.. అక్షరీకరించిన ఆది కావ్యాల్లోంచి.. వేనవేలు గొంతుకలు దీనంగా అర్థిస్తున్నాయి... మాకు పూజలు వద్దు.. పురస్కారాలు వద్దు.. మాన ప్రాణాలతో మమ్మల్ని మనుషులుగా బతకనివ్వండి చాలు" అంటూ స్త్రీల ఆర్తికి కవితా రూపమిస్తారు. భారత వివాహ వ్యవస్థలో యజమాని-బానిస సంబంధాలు కన్పిస్తాయి. దీన్నే కాంప్రమైజ్ కవితలో 'కలిసిపోయిన మనసులతో కాక... నలిగిపోయిన శరీరాలతో మాత్రమే వారు మిగిలారు... అయినా వాళ్లు జీవితాంతం కలసే బతుకుతారు.. పెద్దల కోసం, ఆ తర్వాత పిల్లల కోసం' అనే చేదు నిజాన్ని కొందరి వైవాహిక జీవితాల గురించి కుండబద్దలు కొట్టినట్టు చెప్తారు కవయిత్రి. ఆడ పిల్లల్ని మైనస్‌లుగా, మగ పిల్లల్ని ప్లస్‌లుగా భావించేవారు ఇప్పటికీ సమాజంలో ఉన్నారు. దాన్ని సహించలేక 'ఇదెక్కడి న్యాయం' కవితలో 'నా జీవితపు నిఘంటువులో ఎన్ని ప్లస్ పాయింట్లు నమోదైనా... నన్ను ఎప్పటికీ మైనస్‌గా పరిగణిస్తారు... ఇదెక్కడి న్యాయం' అని ఆగ్రహిస్తారు. 'రా నేస్తం కలసి నడుద్దాం', 'చిన్నారి మనసు', 'అమ్మా! నీకు వందనాలు', 'రాత్రి', 'అమ్మాయినే', 'మళ్లీ జన్మించావూ', 'తప్పెవరిది' మొదలైన కవితల్లో అణచివేతకు గురవుతున్న ఆడపిల్లల దుస్థితిని ప్రశ్నిస్తారు. దళిత స్త్రీలపై పెద్ద కులాలు చేసే ఆగడాలు, అఘాయిత్యాల మీద 'కులం' అనే కవితలో 'బుగ్గ గిల్లినపుడు... భుజాలు తడిమినపుడు... నా కులం గురుతు రాలేదురా..! 'కనెప్షన్'కు పనికొచ్చిన నేను.. కాపురానికి పనికి రానట్రా... దొంగ సచ్చినోడా!' అని నిరసిస్తారు. ఆడ పిల్లలని మగ పిల్లలతో సమానంగా పెంచే మరో సంస్కృతి రావాలని తపిస్తూ రాసిన కవయిత్రికి ఇది తొలి పుస్తకం.

ఇట్లు ఓ ఆడపిల్ల
కవయిత్రి: గంగవరపు సునీత
పుటలు: 100
వెల: 60/-
ప్రతులకు:
జి.శ్యామ్‌బాబు, కర్నూల్
ఫోన్ నంబర్:
9493113947

- మందరపు హైమవతి



పనీర్ స్ప్రింగ్ రోల్స్

కావాల్సిన పదార్థాలు

పనీర్ - 100 గ్రాములు
క్యారెట్, క్యాబేజీ తరుగు-1 కప్పు
కొత్తిమీర- కొద్దిగా
మిరియాల పొడి-1 టేబుల్ స్పూన్
సోయా సాస్ -1 టేబుల్ స్పూన్
ఉప్పు-తగినంత
రోల్స్‌కు కావల్సినవి
గుడ్డు-ఒకటి
పాలు-1 కప్పు
మైదా-6 టేబుల్ స్పూన్లు
నూనె-సరిపడా

తయారుచేసే విధానం

ఒక గిన్నెలో గుడ్డు సొన, పాలు, మైదా, ఉప్పు, కొత్తిమీర తరుగు తీసుకుని కలిపి పక్కన పెట్టుకోవాలి. ఒక బాణలిలో రెండు చెంచాల నూనె వేసి కూరగాయ ముక్కలు పనీర్ తురుము, మిరియాల పొడి, సోయాసాస్, ఉప్పు వేసి బాగా వేగాక దింపేయాలి. ఇప్పుడు పొయ్యి మీద పెనం పెట్టి వేడయ్యాకక నూనె రాసి మైదా మిశ్రమాన్ని దోశలా వేసి రెండు వైపులా కాల్చాలి. అందులో కూరగాయ ముక్కల్ని ఉంచి రోల్‌లా చుట్టి ఒక ప్లేట్‌లో పెట్టి పక్కన పెట్టుకోవాలి. కొద్దిగా చల్లారాక రెండు చివర్ల అంచుల్ని మూసి కాగిన నూనెలో ఒక నిమిషం పాటు వేయిస్తే పనీర్ రోల్స్ రెడీ!

మింట్ లాలీపాప్స్



కావాల్సిన పదార్థాలు

బెల్లం తరుగు-కప్పు
ఓట్స్-1 కప్పు
వేయించిన నువ్వులు- 1కప్పు
నెయ్యి-2 టేబుల్ స్పూన్లు
పుదీనా-2 కట్టలు
జీడిపప్పు-10
టూత్‌పిక్స్-కొన్ని



తయారు చేసేవిధానం

ముందుగా పుదీనా ఆకుల్ని శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. స్టౌ పై ఒక పాత్ర ఉంచి కొద్దిగా నీరుపోసి అందులో పుదీనా ఆకుల్ని మరిగించి వడకట్టాలి. ఆ నీటిలో బెల్లం వేసి పాకం పట్టుకోవాలి. ముదురు పాకం వచ్చాక జీడిపప్పు పలుకులు, ఓట్స్, నువ్వులు వేయాలి. ఈ మిశ్రమం దగ్గరగా అయ్యాక దింపేయాలి. 10 నిమిషాల తర్వాత చేతికి కొద్దిగా నెయ్యి రాసుకుని ఓట్స్ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి టూత్‌పిక్‌కి గుచ్చితే మింట్ లాలీపాప్స్ రెడీ!



వావ్ పావ్

కావాల్సిన పదార్థాలు

బన్-4
ఉడికించిన బంగాళా దుంప ముద్ద-1 కప్పు
ఉల్లిపాయలు-2
టమాటాలు-2
సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు-1/4 కప్పు
సేవ్ - 1/2 కప్పు
దానిమ్మ గింజలు, జీడిపప్పు పలుకులు-1/4 కప్పు
వెన్న -100 గ్రాములు
గరం మసాల-1/2 చెంచా
ఉప్పు-కొద్దిగా
కారం-1 టేబుల్ స్పూన్
చిక్కని చింతపండు రసం-1/2 కప్పు
ఖర్జూరాలు- 10
నూనె-2 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

చింతపండు గుజ్జులో గింజలు తొలగించిన ఖర్జూరాలు, కొద్దిగా ఉప్పు వేసి మీఠా చట్నీ తయారుచేసుకోవాలి. టమాటాలు, ఉల్లిపాయలను తరిగి మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. బాణలిలో నూనె వేడి చేసి ఉల్లి, టమాటా పేస్ట్‌లని వేయించాలి. పచ్చి వాసన పోయాక బంగాళాదుంప ముద్ద కలపాలి. ఐదు నిమిషాలయ్యాక కొద్దిగా ఉప్పు, గరంమసాలా, కారం వేసి కలుపుకోవాలి. ఈ మిశ్రమం ముద్దలా అయ్యాక దింపేయాలి. దీనిపై ఉల్లిపాయ ముక్కలు పరచి నట్టుగా చల్లాలి. తర్వాత జీడిపప్పు ముక్కలు, దానిమ్మ గింజలు చివరిగా కొత్తిమీర తరుగు వేయాలి. వీటిని కలపకుండా అలానే ఉంచాలి. బన్‌ని ముక్కలు చేయకుండా మధ్యకు కొద్దిగా కోసి ఈ మిశ్రమాన్ని కొద్దిగా ఉంచాలి. ఇలా అన్ని బన్నుల్లో నింపాలి. ఇప్పుడు పెనం వేడి చేసి వెన్న ముంచి ఆ తర్వాత సేవ్ అద్దాలి. పైన మిగిలిన కొత్తిమీర, దానిమ్మగింజలతో గార్నిష్ చేసి వేడి వేడిగా వావ్ పావ్‌ని టేస్ట్ చేస్తే రుచిగా ఉంటాయి.

బాల నేస్తాలు

నీడ గుర్తించండి

పిల్లలూ! మీరు పెద్ద పాముని ఎప్పుడైనా చూశారా? ఇక్కడ ఒక పామునుంచాం. కిందున్న నీడల్లో దాని అసలైన నీడ ఏదో గుర్తించి పెన్‌తో మార్క్ చేయండి.





ఎన్నున్నాయి?

బంటి వాళ్ల గార్డెన్‌లో మొక్కలకి నీరందిస్తున్నాడు. ఈ గార్డెన్‌లో అందమైన పూలు కొన్ని జంతువులు, పక్షులతో పాటు మనింట్లో వాడుకునే కొన్ని వస్తువులు కూడా దాగున్నాయి. అవెక్కడున్నాయో గుర్తించి సున్నా చుట్టేయండి.

బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేనొక స్టార్‌ని. ఇది నా చిన్ననాటి ఫోటో. ఇంతకీ నేనెవరో గుర్తించండి?

లెక్కించండి

పిల్లలూ మీకు అంకెలతో ఆటలంటే ఇష్టం కదా! మీకోసం ఇక్కడ కొన్ని యాపిల్స్ ఉంచాం. మీరు చేయాల్సిందేంటంటే ఒక్కో వరుసలో ఉన్న రెండు బాక్సుల్లో మొత్తం ఎన్ని యాపిల్స్ ఉన్నాయో లెక్కించి పక్కన ఇచ్చిన ఖాళీ బాక్సులో ఆ అంకెని రాసేయండి!





ఆకులతో బొమ్మ

మనింటి ముందు రాలి పడిపోతుండే పచ్చి ఆకులు, ఎండుటాకులతో అందంగా ఓ పువ్వును ఎలా చేయచ్చో ఇక్కడ ఇచ్చాం! దాన్ని గమనించి మీరూ తయారు చేసేయండే!

దారి కనిపెట్టండి



పదాలు పూరించండి

ఇక్కడ కొన్ని జంతువులు వాటి ఇంగ్లిష్ పేర్లనిచ్చాం. అయితే ఆ పేర్లలో ఒకటి రెండు అక్షరాలు మిస్సయ్యాయి. వాటిని కలిపేస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సయిన అక్షరాల్ని గుర్తించి ఖాళీల్లో నింపేయండే!



జ:deer,bear,chick,cow,zebra,tiger,cheetah,horse,dog, fox, lion, wolf, lamb,duck, panda

అతిపిన్న తబలా ప్లేయర్

పిల్లలూ! మీకు సంగీతమంటే ఎంతో ఇష్టం కదా! చాలా మంది పిల్లలు ఇప్పటికే వేసవి సెలవుల్లో గిటార్, డ్రమ్స్, తబలా, ఫ్లూట్, వీణ ఇలా ఏదో ఒక వాద్యపరికరాన్ని నేర్చుకుంటుంటారు. మరి ప్రపంచంలోకెల్లా అతి పిన్న వయసున్న తబలా ప్లేయర్ ఎవరో తెలుసా?

ముంబయిలోని ములుంద్ ప్రాంతానికి చెందిన తృప్తిరాజ్ పాండ్య....కాదు కాదు... మాస్టర్ తృప్తిరాజ్ పాండ్య అతి పిన్న వయసున్న తబలా

ప్లేయర్. రెండేళ్లు కూడా నిండకుండానే పాండ్య తబలాపై వేగంగా వేళ్లు కదిల్చేవాడు. ఇక రెండో ఏట ప్రవేశించగానే ముంబయిలోని సోమయా కళాశాలలో తన మొదటి ప్రదర్శన ఇచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచాడు పాండ్య. మూడేళ్లకే ఆలిండియా రేడియోలో ఒక లైవ్ ప్రోగ్రామ్ ఇచ్చి పలువురి మన్ననలతో పాటు 'బాల కళారత్న' బిరుదుని అందుకున్నాడు. నాలుగో ఏట పాండ్యకి దూరదర్శన్‌లో ప్రోగామ్ ఇచ్చే అరుదైన అవకాశం దక్కింది. 18 నెలల వయసులోనే ఇంట్లో నానమ్మ పాడే జానపద పాటలు, భక్తి పాటలకు అల్యూమినియం డబ్బాలపై పాండ్య లయబద్ధంగా వాయించేవాడు. తన పుట్టిన రోజు కానుకగా పాండ్యకి పిల్లలు వాయించే ఢోలక్ కానుకగా లభించింది. ఇక దానిపైనే తన సాధనంతా. పాండ్య అభిరుచికి తండ్రి అతుల్, తల్లి వీణా పాండ్య ప్రోత్సహం కూడా తోడవటంతో నానమ్మ పాటలకి తన వాయిద్యాన్ని జోడిస్తూ సొంతగా ప్రోగ్రామ్స్ ఇచ్చే స్థాయికి చేరుకున్నాడు. ఒక రోజు

పాండ్య ఇచ్చిన ప్రోగ్రామ్‌ని రికార్డ్ చేసి తండ్రి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్‌కి పంపాడు. పాండ్య అద్భుత ప్రదర్శనని చూసి జడ్జిలందరూ ఆశ్చర్యపోయారు. లిమ్కాబుక్ రికార్డు స్థాయికి పాండ్య చేరుకున్నా అప్పటికి తనకి 12 ఏళ్లు నిండకపోవడంతో తన పేరు నమోదు చేయడం కుదరదని చెప్పారు. ముంబయిలో వివిధ ప్రాంతాల్లో వందలాది ప్రోగ్రామ్స్ ఇస్తూ మరింతగా పేరుతెచ్చుకున్న పాండ్య ఆరవ ఏట అతి పిన్న తబలా ప్లేయర్‌గా గిన్నిస్ రికార్డ్స్‌లో స్థానాన్ని దక్కించుకున్నాడు. దేశవ్యాప్తంగా 50కి పైగా ప్రోగ్రామ్స్‌ని ఇచ్చిన పాండ్య చదువులోనే కాదు క్రికెట్ ఆడటంలోనూ దిట్టే. తబల వాద్యకారుడిగా, మంచి క్రికెట్ ప్లేయర్‌గా రాణించాలనే పాండ్య కోరిక నెరవేరాలని మనమూ కోరుకుందాం.

పదవికాసం - 28

కూర్పు: రావెళ్ళ

ఆధారాలు

అడ్డం

1. అందరికీ మామ (4)
3. ముల్లు (4)
7. 'పుట్టు' కు వ్యతిరేకం (2)
8. 'తెలుగు లెంక' బిరుదుగల వ్యక్తి ఇంటిపేరు (3)
9. చిన్నకాదు (2)
12. మనము కాదు అడవి (3)
13. అక్షరాలు దిద్దేది (3)
17. దున్నుట (2)
18. సువాసనగల ఆకు....దీని వాసన మరవలేం (3)
19. గట్టు (2)
22. పొదుపు చేసేవాడు తిరగబడ్డాడు (4)
23. లెక్కలు (4)

1		2		✿	3	4		5
	✿		✿	6	✿		✿	
7		✿	8			✿	9	
	✿	10	✿		✿	11	✿	
✿	12			✿	13			✿
14	✿		✿	15	✿		✿	16
17		✿	18			✿	19	
	✿	20	✿		✿	21	✿	
22				✿	23			

నిలువు

1. చంద్రునితో కోట. ఒక ఊరు (4)
2. పదము (2)
4. మోసము (2)
5. కళ్ళజోడును ఇలా కూడా అంటారు (4)
6. బాగా పాడిన వారిని ఇలా పాడారని అంటాం (3)
10. మనశ్శాంతి కోసం కళ్ళు మూసుకుని చేసేది (3)
11. కలకలములో రాసేది (3)
14. అనంతరము (4)
15. భారము (3)
16. మిరియాలలో ఒక గింజ (3)
20. కింది నుండి డబ్బు (2)
21. ప్రవాహం (2)

సుడోకు

		2			6	9	8	3
		6				1		
3	8	4			1	5	6	7
	9	1	3	6				8
			8		7			
8				9	4	6	5	
7	1	9	5			8	2	6
		3				7		
5	6	8	1			4		

మిస్సింగ్ నంబర్స్

పక్క బాక్సుల్లో మిస్సయిన అంకెలు గుర్తించండి. బాక్సుల కింద ఇచ్చిన అంకెల్లో ఒకటి గణితం ఆధారంగా సరైనది అవుతుంది.

12	30	18
42		36
54	24	48

6 7 9

26	11	18
7		3
19	6	15

5 6 7

గతవారం జవాబులు

1	4	5	2	8	3	7	9	6
6	8	3	5	7	9	1	4	2
7	9	2	4	6	1	5	3	8
4	7	9	3	1	2	6	8	5
2	3	6	8	5	7	4	1	9
8	5	1	9	4	6	3	2	7
9	6	4	7	3	8	2	5	1
5	2	7	1	9	4	8	6	3
3	1	8	6	2	5	9	7	4

✿	1 ఏ	2 కం	గా	✿	3 ఆ	4 కా	శం	✿
5 అ	✿	రం	✿	6 ము	✿	య	✿	✿
7 ను	జ్జు	✿	8 వ	సు	ధ	✿	9 క	10 వి
వం	✿	11 స	✿	రు	✿	12 చ	✿	జ
13 శి	వ	మ	ణి	✿	14 క	ర	క్యా	య
క	✿	గ్రం	✿	15 ము	✿	ణం	✿	న
16 త	ప్ప	✿	17 లె	క్క	లు	✿	18 డే	గ
✿	✿	19 తె	✿	ర	✿	20 ప	✿	రం
✿	21 త	గ	వృ	✿	22 సి	ని	మా	✿

అశ్వం.. అందం...

ప్రపంచంలోనే అత్యంత అందమైన గుర్రం ఏమిటనే సందేహం వస్తే.. వెంటనే ఫ్రెడెరిక్ ది గ్రేట్ వైపు చూస్తున్నారిపుడు. ప్రష్యా చక్రవర్తి కాదులెండి ఇదిగో ఈ గుర్రం పేరే అది. ఈ 'బ్లాక్‌బ్యూటీ' అందం చందానికి కారణం ఒత్తైన కేశాలే. దానికితోడు మిలమిలా మెరిసే చర్మం. అంతకు మించి యుద్ధ అశ్వ దారుఢ్యం. అందుకే ఇది గ్రేట్ అయ్యింది. అమెరికాలోని ఒజార్క్ పర్వతాల వద్ద ఉన్న ఫ్రీసియన్ పిన్నకల్స్‌లో ఇది ఉంది. కాంస్య విగ్రహం రోడ్డు మీద నడుస్తుందనేలా ఉన్న ఈ అశ్వరాజం పేరు గోల్డెన్ అఖాల్ టెకె. టర్క్‌మెనిస్థాన్ జాతీయ చిహ్నంగాను క్రెడిట్ కొట్టేసిందిది. అంత ప్రత్యేకత ఉందనే దాన్ని గోల్డెన్ హార్స్ అని పిలుస్తున్నారు. జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ అశ్వం బొమ్మలా కనిపిస్తుంది. ఇక సొర్రైయా మస్టాంగ్ పిలుస్తోన్న ఈ బ్లాండ్ బ్యూటీ క్రెమెల్లో జాతికే వన్నె తెస్తోంది.



వరి చేను పరిచేను

వియత్నాంలోని ము కాంగ్ చై, సా పా, హోవాంగ్ సూ ఫి, హా గియాంగ్ ప్రాంతాల్లోని కొండలపై వరి చేలు ఇవి. పచ్చటి కార్పెట్‌ను కొండ మెట్లపై పరిచారేమో అనిపిస్తుంది వీటిని చూస్తే. సాగు అక్కడే. పాడి అక్కడే. ఇల్లు అక్కడే. మొత్తం జీవితం అక్కడే స్థానిక తెగలకు. గట్టి గ్రానైట్ కొండలపై జీవమున్న మట్టిని వర్షం తడిపి ముద్ద చేస్తుంది. దాన్ని అనుకూలంగా మలుచుకుని వరి సాగుతో ముద్దు చేస్తున్నారు అక్కడి రైతులు.